# ఢిల్లీలో ప్రియాంక గాంధీ వాద్రాను



**- మర్యాదపూర్వకంగా కలిసిన టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్**

**వుదయం మనూరు**
**అక్టోబర్:13**

ఢిల్లీ: ఇండియా కూటమి సమావేశంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు శ్రీమతి ప్రియాంక గాంధీ వాద్రా గారిని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ గారు ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారితో పాటు ప్రభుత్వ ముఖ్య సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి గారు, జహీరాబాద్ ఎంపీ శ్రీ సురేష్ కుమార్ షెట్కర్ గారు, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, చామల కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ భేటీలో ఇండియా కూటమికి సంబంధించిన అంశాలపై నాయకులు సమావేశమైన సందర్భంగా పరస్పరం కలుసుకున్నారు.

# మల్లికార్జున హిల్స్ కాలనీలో అంబరాన్నంటిన దాండియా సంబరాలు

**బీరంగూడ:**



శరన్నవరాత్రుల పర్వదినాలను పురస్కరించుకుని బీరంగూడలోని మల్లికార్జున హిల్స్ కాలనీలో శ్రీ నందారం లలిత రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో దాండియా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో పండుగ సందడి నెలకొనగా, మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని దాండియా నృత్యాలతో అలరించారు. సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొన్న మహిళలు, యువతులు రంగురంగుల దుస్తులతో వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సంగీతానికి అనుగుణంగా అడుగులు వేస్తూ, కర్రలతో లయబద్ధంగా దాండియా నృత్యాలు చేస్తూ సందడి చేశారు.శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారి పట్ల భక్తిశ్రద్ధలను చాటుకుంటూ, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే దాండియా వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమం కాలనీవాసుల్లో పండుగ ఉత్సాహాన్ని నింపడంతో పాటు అందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చింది. చిన్నా పెద్దా తేడా లేకుండా వేడుకల్లో భాగస్వాములై ఆనందంగా గడిపారు.ఈ సందర్భంగా శ్రీ నందారం లలిత రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం కాలనీవాసుల మధ్య ఐక్యత, స్నేహభావం, పరస్పర సహకారాన్ని పెంపొందించేందుకు దోహదపడింది. నేటి ఆధునిక జీవనశైలిలో సంప్రదాయ కళలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా భావితరాలకు మన సంస్కృతి, ఆచార వ్యవహారాలను పరిచయం చేయవచ్చనే సందేశాన్ని ఈ వేడుక చాటిచెప్పింది.దాండియా నృత్యాల సందడి, ఉత్సాహభరితమైన వాతావరణం, సంప్రదాయ కళల ప్రదర్శనతో మల్లికార్జున హిల్స్ కాలనీ పండుగ శోభను సంతరించుకుంది. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు కాలనీవాసుల మధ్య ఐకమత్యాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు అందరిలో సంతోషాన్ని నింపుతాయని స్థానికులు అభిప్రాయపడ్డారు. శరన్నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన ఈ దాండియా వేడుకలు కాలనీవాసులకు మధురమైన అనుభూతిని అందించాయి.

# ఇటీవల్ల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టు పట్టించుకోని అధికారులు

**- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న రైతులు గ్రామస్తులు.**

**చిలుకూరు**
**అక్టోబర్ 13: (వుదయం )**



మండల కేంద్రంలోని పాత చిలుకూరు గ్రామ పంచాయతీ కార్యాలయం నుండి శివాలయం, బేత వోలు రోడ్డుకు వెళ్లే దారిలో బ్రహ్మదేవుడి కుంట అలుగు పై ఉన్న వాగు పై గల కల్వర్టు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. మట్టి రోడ్డుపై పగిలిన నిర్మాణ వ్యర్థాలు చెత్త చదరంతో పాటు పైపుల్లేను ఆరుబయట అడ్డంగా తేలి ఉండటంతో ద్విచక్ర వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడి గాయ పడుతున్నారు,వాగు పై నిర్మిం చిన కల్వర్టు సుమారు 90శాతం దెబ్బతినడంతో ఈ కల్వర్టుపై నుంచి కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లే పరిస్థితి లేకపోవడంతో వాహనదారులు, అటువైపు తమ పొలాలకు వెళ్లే రైతులు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. పొలాలకు వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్ట ర్లు, ఇతర బండ్లతో వెళ్లాల్సి వస్తే చిలుకూరు గవర్నమెంట్ హాస్పటల్ నుండి జాతీయ రహ దారిపై కిలోమీటర్ల కొద్దీ చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని రైతన్న లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శిథిలావస్థకు చేరిన శివాలయం వద్ద దెబ్బతిన్న కల్వర్టు స్థానంలో తక్షణమే నూతన వంతెన నిర్మించాలని, రైతులు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు స్పం దించి కాలువపై కొత్త వంతెన నిర్మించేలా చర్యలు తీసు కోవాలని రైతులు గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు,

# మాగనూర్ ప్రెస్ క్లబ్ ఏకగ్రీవం...



**మాగనూర్ అక్టోబర్ 13 (వుదయం న్యూస్)**

మాగనూరు ప్రెస్ క్లబ్ కమిటీని సీనియర్ పాత్రికేయుల ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా జి .ప్రహ్లాద్ రెడ్డి, ఎస్.లక్ష్మణ్ అధ్యక్షులుగా పుంజనూర్ సురేష్, ప్రధాన కార్యదర్శిగా బాల్దాస్ కథలప్ప, ఉపాధ్యక్షులుగా జి. నరేష్, కె. శివకుమార్, కోశాధికారిగా బాల్దాస్ శ్రీనివాస్ లను కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా రాజు, రమేష్ గౌడ్, రాము, శేఖర్ గౌడ్,అశోక్, రాజు రమేష్ ల ను ఎన్నుకున్నారు నూతన అధ్యక్షులు సురేష్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల సాధన కోసం కృషి చేస్తానన్నారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నెరవేర్చే దిశగా ప్రణాళికను అమలు చేస్తానని అన్నారు. నపై నమ్మకంతో అవకాశం ఇచ్చిన మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

# సింగరేణి కార్మికులకు 34 శాతం లాభాల వాటా ప్రకటన

**ప్రభుత్వ నిర్ణయంపై హర్షం..**
**కొత్తగూడెం ఏరియా ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో స్వీట్ల పంపిణీ**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా**
**అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి )**



సింగరేణి కార్మికులకు 34 శాతం లాభాల వాటా చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సింగరేణి పరిసర ప్రాంతాల శాసనసభ్యులు, సింగరేణి యాజమాన్యం సంయుక్తంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. సింగరేణి సంస్థ ఆర్జించిన రూ.1,754 కోట్ల లాభాల్లో 34 శాతం వాటాను కార్మికులకు చెల్లించనున్నారు.

అలాగే డీఎల్ఆర్ కార్మికులకు గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా రూ.5,500 చెల్లించాలని నిర్ణయించారు. ప్రభుత్వ నిర్ణయంతో కార్మికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఐఎన్‌టీయూసీ జాతీయ నాయకులు డాక్టర్ జి. సంజీవరెడ్డి, ఐఎన్‌టీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి. జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు కొత్తగూడెం ఏరియా ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్‌లో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు, నాయకులు పరస్పరం స్వీట్లు తినిపించుకుంటూ తమ ఆనందాన్ని పంచుకున్నారు. కార్మికుల సంక్షేమానికి పెద్దపీటసింగరేణి కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ లాభాల వాటాను ప్రకటించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, సింగరేణి యాజమాన్యానికి కార్మిక నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల కష్టానికి తగిన గుర్తింపు లభించేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్మికులు ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ బుటిక రాజేశ్వరరావు, కేంద్ర, శాఖ కార్యదర్శులు సకినాల సమ్మయ్య, ఎం. కొమరయ్య, భీముడు, మెంగని అశోక్, ఫిట్ కార్యదర్శులు చిలక రాజయ్య, ఎండీ సత్తార్ పాషా, గోపు కుమారస్వామి, ఈ. మోహన్ రెడ్డి, కే. నటరాజ్, జి. మల్లికార్జునరావు, జల్లి కిరణ్, భాను కమల్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.అలాగే సూపర్‌వైజర్ యు. రమేష్ బాబు, ఎస్‌డీ యాఖుబుద్దీన్, చందులాల్, బాబుద్దీన్, జడల చంద్రశేఖర్, బొజ్జ వెంకటస్వామి, సముద్రాల శ్రీనివాస్, సలిగంటి శ్రీనివాస్, ఖాజా పాషా, కొప్పుల కుమార్, జి. నరేష్, అల్తాఫ్, అజ్గర్, మహమ్మద్ గౌస్, ముజాహిద్, టి.ఆర్.ఎస్. రాజు, మేకల గిరిబాబు, వై. ఈశ్వర్, కే. సత్యనారాయణ, కిషన్, ఏసురత్నం, శివరాం, జి.వి.ఎల్. శ్రీనివాస్, సారా సమ్మయ్య, బండి సంపత్, ఈ. రాజయ్య, వెంకటేశ్వరరావు, రమేష్‌తో పాటు పలువురు కార్మిక నాయకులు, కార్యకర్తలు, వర్క్‌షాప్ ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు, డీఎల్ఆర్ కార్మికులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం

**అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయాలి: సర్పంచ్ కాంపాటి వెంకట్**

**మునగాల,**
**అక్టోబర్ 13 (వుదయం):**

మునగాల మండలంలోని నారాయణ గూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సంబంధించిన పత్రాలను గ్రామ సర్పంచ్ కాంపాటి వెంకట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, గ్రామ అభివృద్ధికి ప్రజలంతా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ నరేష్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

# గ్రామం క్షేమం కోసమే అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ

**రేపాల ఉపసర్పంచ్ తుమ్మ సతీష్**

**మునగాల,**
**అక్టోబర్ 13 (వుదయం):**



గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, రైతులకు పాడిపంటలు సమృద్ధిగా పండాలని, గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ రేపాల ఉపసర్పంచ్ తుమ్మ సతీష్ దుర్గాదేవి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మునగాల మండలం రేపాల గ్రామంలోని ఒకటో వార్డులో విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుని పట్టు వస్త్రాలు, పూలు, పండ్లు, గాజులు, పసుపు, కుంకుమ సమర్పించారు. ఈ సందర్భంగా తుమ్మ సతీష్ మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, రైతులకు పంటలు బాగా పండాలని, గ్రామ అభివృద్ధి నిరంతరం కొనసాగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన కుమారుడు హరి వరుణ్ తేజ, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్ ప్రవేశాలు




**దరఖాస్తులకు నవంబర్ 12 చివరి తేదీ**

**వుదయం,**
**తెల్లాపూర్ ప్రతినిధి (అక్టోబర్ 13)**

తెల్లాపూర్ డివిజన్ కొల్లూర్ గ్రామంలో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో 2026, 27 విద్యా సంవత్సరానికి పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ఓపెన్ విధానంలో ప్రవేశాలు కల్పిస్తున్నమని, చదువును మధ్యలో ఆపేసిన వారు, వివిధ కారణాలతో విద్యకు దూరమైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొల్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ దిలీప్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. దూరవిద్య విధానంలో చదువుకునేందుకు ఆసక్తి ఉన్నవారు నవంబర్ 12, 2026 లోపు దరఖాస్తు చేసుకోవాలనీ, కొల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ అజ్మతుల్లా తెలిపారు. 9701072187కు సంప్రదించాలని కోరారు.

# తుల్జాపూర్ భవానీ మాత దర్శనం

**అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించిన నాయకులు..**

**పటాన్చెరు (వుదయం):**



మహారాష్ట్రలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తుల్జాపూర్ శ్రీ తుల్జా భవానీ మాత ఆలయాన్ని పటాన్చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారు, పటాన్చెరు మాజీ కార్పొరేటర్ శ్రీ మెట్టు కుమార్ యాదవ్ గారు తమ బృందంతో కలిసి మంగళవారం (అక్టోబర్ 13)న సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి గారు, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ గారు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.అనంతరం మెట్టు కుమార్ యాదవ్ గారు మాట్లాడుతూ.. పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి గారితో కలిసి తుల్జాపూర్ భవానీ మాతను దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. అమ్మవారి కృపాకటాక్షాలు పటాన్చెరు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని, నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించేందుకు కృషి

**పది మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ**

**మునగాల,**
**అక్టోబర్ 13 (వుదయం):**



మునగాల మండల పరిధిలోని నరసింహపురం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇటీవల ఇళ్లు మంజూరైన పది మంది లబ్ధిదారులకు గ్రామ సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసర్ల కోటయ్య ఆధ్వర్యంలో ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు ఇళ్లు మంజూరు కావడం సంతోషకరమన్నారు. స్థానిక ఎమ్మెల్యే నల్లమాద పద్మావతి రెడ్డి, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో మిగిలిపోయిన అర్హులైన లబ్ధిదారులకు కూడా రాబోయే రోజుల్లో ఇళ్లు మంజూరయ్యేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ నరేష్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఉపసర్పంచ్ రెడ్డబోయిన ప్రశాంత్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండు లక్ష్మీనారాయణ, వార్డు సభ్యులు షేక్ అజీజ్ మియా, కేసకాని కామేశ్వరి, వెంకన్న, రేపూరి కళ్యాణి బాబు, మీసాల బిక్షం, కాంగ్రెస్ నాయకులు ఓరుగంటి రవి, కాలె సామేలు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు అన్నప్రసాద వితరణ



**మునగాల,**
**అక్టోబర్ 13 (వుదయం):**

పుట్టినరోజు వేడుకలను అనాథ వృద్ధుల మధ్య జరుపుకుంటూ ఆలేటి గురు ప్రసాద్-ప్రమీల దంపతులు సేవా భావాన్ని చాటుకున్నారు. మునగాల మండలం తాడువాయి గ్రామానికి చెందిన ఈ దంపతుల కుమారుడు కృషాల్ శివన్ మొదటి పుట్టినరోజు సందర్భంగా మండలంలోని ముకుందాపురం సమీపంలో ఉన్న ఇందిరా అనాథ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 40 మంది వృద్ధులకు సీట్లు, వివిధ రకాల వంటకాలతో అన్నప్రసాదాన్ని అందించారు. చిన్నారి పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేయడం పట్ల వృద్ధులు సంతోషం వ్యక్తం చేస్తూ చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ గంధం సైదులు, జర్నలిస్ట్ ఆలేటి మహేష్, వృద్ధాశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు కోతలు లేకుండా కరెంటు ఇవ్వాలి

**బిజినపల్లి,**
**అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి):**



రైతులకు ప్రభుత్వం 24 గంటల పాటు కోతలు లేకుండా కరెంటు సరఫరా చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గుంపల్లి అశోక్ డిమాండ్ చేశారు.బిజినపల్లి మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం ముందు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. కార్యాలయంలో సిబ్బంది ఎవరూ లేకపోవడంతో తలుపులకు వినతిపత్రం అంటించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితిలో రైతులు ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు వేసిన పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయని, ముఖ్యంగా వరి, వేరుశనగ, మినుము పంటలు పూర్తిగా నాశనమయ్యే పరిస్థితి నెలకొందని అన్నారు. కరెంటుపై ఆధారపడి జీవిస్తున్న లాండ్రీ షాపులు, ఎలక్ట్రికల్ షాపులు పూర్తిగా మూసివేసుకునే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చొరవ తీసుకుని అంతరాయం లేకుండా కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు కే. మల్లేష్, డి. మల్లేష్, జంపులేష్ రాములు తదితరులు పాల్గొన్నారు.

# క్రమబద్ధీకరణతోపాటు ప్రసూతి సెలవులు మంజూరు చేయాలి

**నాగర్ కర్నూల్,**
**అక్టోబర్ 13 (వుదయం బ్యూరో):**



గ్రామాలలో వైద్య సేవలు అందిస్తున్న ఎన్‌హెచ్ఎం సిబ్బందిని క్రమబద్ధీకరించడంతోపాటు మహిళా ఉద్యోగులకు 180 రోజులు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులను మంజూరు చేయాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు.మంగళవారం ఎన్‌హెచ్ఎం జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షలను చేపట్టారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 2022 నుండి పెండింగ్‌లో ఉన్న 5 శాతం వార్షిక ఇంక్రిమెంట్‌ను, 8 శాతం లాయల్టీ బోనస్‌ను చెల్లించాలని కోరారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం ప్రతి ఉద్యోగికి క్యాడర్ ఈక్వేషన్ అమలు చేసి 100% వేతనాన్ని చెల్లించాలని కోరారు. అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీలను రద్దు చేసి ఎన్‌హెచ్ఎం ఉద్యోగులందరినీ రాష్ట్ర హెల్త్ సొసైటీలోనే కొనసాగించి నేరుగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.ఇతర శాఖల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతోపాటు మహిళా సిబ్బందికి కేడర్‌తో సంబంధం లేకుండా ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని, ఉద్యోగి మరణించినట్లయితే వారి కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా, జీవిత బీమాతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. ఈహెచ్‌ఎస్, ఈఎస్ఐ సౌకర్యాన్ని కల్పించాలని, జీవో నెంబర్ 60 మరియు 11/95 ప్రకారం పెంచిన వేతనాలను తక్షణమే చెల్లించాలని, పెరుగుతున్న నిత్యవసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

# అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన లలితా పరమేశ్వరి అమ్మవారు

**వుదయం, సిద్దిపేట ప్రతినిధి**



సిద్దిపేట పట్టణంలోని శ్రీశ్రీశ్రీ అష్టలక్ష్మి సహిత లలితా పరమేశ్వరి దేవాలయం లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తుల కు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి దద్ధ్యోజనం నైవేద్యంగా సమర్పించి, చండీ హోమం నిర్వహించారు.ఆలయ నిర్వాహకులు జి. కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాలు అక్టోబర్ 20 వరకు కొనసాగనున్నాయి.ప్రతిరోజూ చండీ హోమం నిర్వహించనున్నట్లు వైదిక నిర్వాహకులు పూసాల వెంకటాచార్యులు తెలిపారు. బుధవారం (అక్టోబర్ 14) అమ్మవారు శ్రీ మహా చండీ రూపంలో దర్శనమివ్వనున్నట్లు ఆలయ నిర్వాహకులు కిరణ్ కుమార్, ప్రధానార్చకులు కృపాకరాచార్యులు వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

# ఉపాధి పనుల్లో వేగం పెంచాలి ఎంపీడీవో తరుణ్



**తెలకపల్లి అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి)**

ఉపాధి హామీ పనుల్లో వేగం పెంచాలని ఎంపీడీవో తరుణ్ కోరారు. తెలకపల్లిలోని మండల కాంప్లెక్స్ సమావేశ భవనంలో మంగళవారం సాయంత్రం జరిగిన ఉపాధి పనుల సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలసిరి పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల ఫోటో క్యాప్చర్ పూర్తి చేసి 90 రోజుల్లో చెల్లింపులు చేయాలని తెలిపారు. ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో ఉపాధి పొందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఆయనతో పాటు ఏపీవో మల్లేశం, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా శక్తి భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన కొల్లూర్ సర్పంచ్:చింతల గట్టు.శివరాజ్"



**ఝరాసంగం అక్టోబర్-13(వుదయం ప్రతినిధి )**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పథకాలు,ప్రజా సంక్షేమ పనులలో భాగంగా,జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు శ్రీ సురేష్ కుమార్ షెట్కార్,ఎంపీ గారి నిధుల నుండి మహిళా శక్తి భవనం మంజూరు కావడం జరిగింది.ఝరాసంగం మండలం కొల్లూరు గ్రామంలో ఈ రోజు గ్రామ సర్పంచ్ చింతల గట్టు. శివరాజ్,చేతుల మీదుగా 'మహిళ శక్తి భవన'నిర్మాణానికి భూమి పూజచేసి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమం లో కొల్లూరు గ్రామ పెద్దలు వీరశెట్టి పాటిల్,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దప్పూరు. సంగమేష్,సిసి మిట్టప్ప,పంచాయతీ కార్యదర్శి రవి,వార్డు సభ్యులు సి హెచ్ పారమ్మ మాణయ్య,వై.నగేష్,సి ప్రకాష్,టి శారదమ్మ,ఫీల్డ్ అసిస్టెంట్ సి.సుబాకర్,VOA మరియమ్మ,VO నాయకురాల్లు ఈశ్వరమ్మ, భాగ్యమ్మ పాటిల్, అనుషమ్మ,గ్రామ పెద్దలు నాయకులు బీరప్ప, కృష్ణ,సి డేవిడ్,సి. నర్సింలు,ఈశ్వర్, గ్రామ ప్రజలు, తధితరులు పాల్గొని భూమి పూజ శంకుస్థాపన కొరకు కొబ్బరికాయలు కొట్టి సీసీ పనులు ప్రారంభించారు.

# చేపల వేటకు వెళ్లి చెరువులో మృతి

*** ఆదివారం వెళ్లి..**
**మంగళవారం విగతజీవిగా**
**గర్భిణి భార్య, కుమారుడిని వదిలి వెళ్లిన కుటుంబ పెద్ద**

**దౌల్తాబాద్, అక్టోబర్ 13(వుదయం):**

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి చెరువులో మృతదేహంగా కనిపించిన ఘటన దౌల్తాబాద్ మండలం గొడుగుపల్లి గ్రామంలో విషాదం నింపింది. గ్రామానికి చెందిన చంద సిద్దిరాములు ఆదివారం చేపల వేటకు వెళ్లగా, మంగళవారం తెల్లవారుజామున చెరువులో మృతదేహమై కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీశారు. సిద్దిరాములు చెరువులో ఏ విధంగా మృతి చెందాడనే విషయం తెలియాల్సి ఉంది. చేపల వేటకు వెళ్లిన ఆయన తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారా? ప్రమాదవశాత్తూ చెరువులో మునిగి మృతి చెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నప్పటికీ, మరణానికి గల కారణాలపై స్పష్టత రావాల్సి ఉంది.మృతుడికి ఓ కుమారుడు ఉండగా, భార్య ప్రస్తుతం గర్భవతిగా ఉంది. కుటుంబానికి ఆధారమైన వ్యక్తి మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై గంగాధర అరుణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.





# ఆర్యవైశ్య మహాసభ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

**నాగర్ కర్నూల్ , అక్టోబర్ 13 (వుదయం బ్యూరో)**



జిల్లా కేంద్రంలో ఆర్యవైశ్య మహాసభ భవన నిర్మాణానికి సంబంధించి మంగళవారం రాష్ట్ర,జిల్లా ఆర్యవైశ్య మహాసభ నాయకులు స్థలాన్ని పరిశీలించారు. భవన నిర్మాణానికి స్థలం దానం చేసిన ఆకారపు విశ్వనాథం ఆధ్వర్యంలో ఈ పరిశీలన కార్యక్రమం నిర్వహించారు.అంతకుముందు పట్టణంలోని జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించి, నిర్మాణానికి సంబంధించిన అంశాలపై చర్చించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ఆకుతోట రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి స్వామి, రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ నాయకులు మాచిపెద్ది శివకుమార్, శ్రీరాములు, కొండూరి గోవర్ధన్, విసనకర్రల చంద్రకుమార్, హకీం రాజేష్, మేడిశెట్టి సురేష్, ఉప్పు ఆంజనేయులు, ఆకుతోట సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో ఫిర్యాదుతో కదలిక అక్కారం పంచాయతీ రికార్డులు స్వాధీనం

**అచ్చంపేట, అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి):**



అచ్చంపేట మండలం అక్కారం గ్రామ పంచాయతీలో దాదాపు రూ.15 లక్షల నిధుల వినియోగంలో అవినీతి జరిగిందన్న ఆరోపణలపై అధికారులు విచారణ చేపట్టారు. జిల్లా పంచాయతీ అధికారి (డీఎల్పీఓ) వెంకట ప్రసాద్ మంగళవారం గ్రామ పంచాయతీ రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో నిధుల దుర్వినియోగం జరిగిందని ఇటీవల గ్రామస్తులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన అధికారులు విచారణకు ఆదేశించారు.ఈ క్రమంలో డీఎల్పీఓ వెంకట ప్రసాద్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ లాలు నాయక్ సమక్షంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించి ఫిర్యాదులోని అంశాలపై వివరాలు సేకరించారు. గ్రామంలో సుమారు ఎనిమిది రకాల అభివృద్ధి పనులకు అధిక మొత్తంలో నిధులు డ్రా చేశారని, కొన్ని పనులు చేపట్టకుండానే నిధులు వినియోగించినట్లు చూపించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామస్తుల ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని రికార్డులను పరిశీలించి సమగ్ర విచారణ చేపడతామని డీఎల్పీఓ వెంకట ప్రసాద్ తెలిపారు. విచారణ అనంతరం పూర్తి వివరాలతో నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని మీడియాకు వెల్లడించారు. దీంతో విచారణలో వాస్తవాలు వెలుగులోకి వస్తాయా, బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారన్న ఆసక్తి గ్రామస్తుల్లో నెలకొంది.

# మహిళా పోలీసుల సాధికారతకు 'జెండర్ సెన్సిటైజేషన్'

**సురక్షిత పని వాతావరణమే లక్ష్యంగా**
**సీపీ రష్మి పెరుమాళ్ ప్రత్యేక ముఖాముఖి**

**సిద్దిపేట, అక్టోబర్ 13 (వుదయం బ్యూరో)**



పోలీసు వ్యవస్థలో పని చేస్తున్న మహిళా అధికారులలో ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మ గౌరవాన్ని పెంపొందించడంతో పాటు వారికి అనుకూలమైన పని వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో 'జెండర్ సెన్సిటైజేషన్' (లింగ సున్నితత్వం) పై మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీ రష్మి పెరుమాళ్, ఐపీఎస్ స్వయంగా పాల్గొని, మహిళా పోలీస్ సిబ్బందితో నేరుగా ముఖాముఖి సంభాషించారు. ఈ సందర్భంగా కమిషనరేట్ బ్యూరో ప్రతినిధి తెలిపిన వివరాల ప్రకారం... పోలీస్ శాఖలో లింగ సమానత్వం, మహిళల పాత్ర, విధుల నిర్వహణలో వారు ఎదుర్కొంటున్న క్షేత్రస్థాయి సవాళ్లు మరియు పని ప్రదేశంలో కల్పించాల్సిన సౌకర్యాలపై సీపీ సుదీర్ఘంగా చర్చించారు. పని ప్రదేశంలో ప్రతి మహిళా ఉద్యోగికి తగిన ప్రాధాన్యత, రక్షణ మరియు గౌరవం లభించేలా సురక్షితమైన, సమ్మేళిత వాతావరణాన్ని అందించడమే తమ యంత్రాంగం యొక్క అత్యంత ప్రాధాన్య అంశమని సీపీ స్పష్టం చేశారు. విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిళ్లను అధిగమిస్తూ, సిబ్బంది మధ్య పరస్పర గౌరవం నెలకొన్నప్పుడే నిజమైన మహిళా సాధికారత సాధ్యమవుతుందని ఈ సందర్భంగా ఆమె పునరుద్ఘాటించారు. ఈసమావేశంలో పాల్గొన్న మహిళా పోలీసులు తమ అభిప్రాయాలను, నిత్య జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలను మరియు క్షేత్రస్థాయి అనుభవాలను సీపీ దృష్టికి తీసుకెళ్లగా, వాటి పరిష్కారానికి ఆమె తక్షణమే సానుకూలంగా స్పందించారు. పోలీసు వ్యవస్థలో మహిళలు కేవలం శారీరక, మానసిక దృఢత్వంతో ఉండటమే కాకుండా, పరస్పరం గౌరవించుకుంటూ ఒకరికొకరు మద్దతుగా నిలిచే ఆరోగ్యకరమైన కార్యాలయ సంస్కృతిని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీ రష్మి పెరుమాళ్, ఐపీఎస్ పిలుపునిచ్చారు.

# ఘనంగా ముగిసిన అండర్ 14 కుస్తీ పోటీలు



**జాతీయస్థాయిలో కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలి**
**డీఈఓ గోవిందరాజులు**

**దామరగిద్ద అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి)**

గత మూడు రోజులుగా నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం కానుకుర్తి గ్రామ పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వ ర్యంలో అండర్ 14 లెవెల్ రెజ్లింగ్ పోటీలో ముగిసా యి.ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా హాజరైన డి ఈ ఓ గోవింద రాజు, పాఠ శాల ప్రధానోపాధ్యాయురాలు అన్నపూర్ణ అధ్యక్షతన కార్యక్రమం ముగిసింది.ఈ సందర్భంగా ఈ ఓ మాట్లాడుతు జాతీయస్థాయిలో రాణించి రాష్ట్రానికి మంచిపేరు తీసుకొని రావాలి అని అన్నారు. నారాయణపేట జిల్లా చదువులతో పాటు ఆటలలో చాలా ముందు ఉన్నాము,జిల్లా కలెక్టర్ ప్రోద్బలంతో జిల్లాలో రెజ్లింగ్ కు ప్రత్యేక కోచింగ్ నిర్వహిస్తున్నామని, రెజ్లింగ్ ఆటలో పాలమూరు జిల్లా తరుపున నారాయణపేట జిల్లా క్రీడాకారులు నాలుగు గోల్డ్,నాలుగు సిల్వర్ మెడల్స్ సాధించి మన జిల్లా పేరు నిలబెట్టారు అని అన్నారు.అండర్ 14 రెజ్లిం గ్ లో 20 కేటగిరీలో పోటీ లు నిర్వహించారు ఇందు లో విజయం సాధించిన వారు ఈనెల 30నుండి న్యూఢిల్లీ త్యాగరాజు స్టేడి యంలో జరిగే జాతీయ స్థాయి పోటీలో పాల్గొంటా రని నారాయణపేట జిల్లా ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ తెలిపారు. పోటీలో విజేత లకు మెడల్స్ మరియు బహుమతులను ముఖ్య అతిథులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ జి ఎఫ్ జిల్లా సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, కానుకుర్తి గ్రామ సర్పంచు ఎన్ నారాయ ణ,ఉప సర్పంచ్ యశోద, దామరదిద్ద సింగిల్ విండో చైర్మన్ఈదప్ప,నారాయణపేట మార్కెట్ కమిటీ తాజా మాజీ చైర్మన్ సదాశివరెడ్డి, మండల విద్యాశాఖ అధికారి సురేష్,విద్యాశాఖ కార్యాలయ అధికారులు నాగార్జున రెడ్డి,విద్యాసాగర్, యాదయ్య,సంగీత లు,ఎస్ జి ఎఫ్ మహబూబ్ నగర్ జిల్లా సెక్రటరీ వేణుగోపాల్,రెజ్లింగ్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు నర్సిములు,మండలం లోని సర్పంచులు,వ్యాయమ ఉపాధ్యాయులు వెంకట ప్ప, రామకృష్ణ రెడ్డి,బాల రాజ్ గౌడ్,రవి కుమార్, నెల్సన్,సాయినాథ్, బీరప్ప,నర్సింహారెడ్డి,బాలరాజు,నర్సింహారెడ్డి,కోచ్ శ్రీనివాస్, రాజేష్, బస్వ రాజు, మండలంలోని వివిధ పార్టీల నాయకులు కాను కుర్తి గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

# ప్రాజెక్ట్ సిద్ధి'లో కానిస్టేబుళ్ల ప్రతిభ

**సీపీ రష్మి పెరుమాళ్ అభినందనలు,**
**బహుమతుల ప్రదానం**

**సిద్దిపేట, అక్టోబర్ 13 (వుదయం బ్యూరో )**




పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ ప్రత్యేక చొరవతో ప్రారంభించిన 'ప్రాజెక్ట్ సిద్ధి' ద్వారా సహాయక రక్షక దళ (ఆర్మ్‌డ్ రిజర్వ్) కానిస్టేబుళ్లు సరికొత్త నైపుణ్యాలను పెంపొందించుకుంటున్నారని, కేవలం దినచర్య విధి నిర్వహణకే పరిమితం కాకుండా సిబ్బందిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేలా ఈ కార్యక్రమం రూపుదిద్దుకుందని వెల్లడైంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా కానిస్టేబుళ్లు క్రీడలు, ఆత్మరక్షణ విద్యలు, యోగా వంటి శారీరక దృఢత్వ శిక్షణలతో పాటు కుట్టు పని, మోటారు వాహన మరమ్మతులు వంటి సాంకేతిక, వృత్తి విద్యా నైపుణ్యాలలో శిక్షణ పొందుతున్నారు. ఈ శిక్షణా కార్యక్రమాలపై మంగళవారం నిర్వహించిన పునఃసమీక్షలో సిబ్బంది నుంచి విశేష స్పందన లభించింది. శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అంకితభావంతో పనిచేసిన కానిస్టేబుళ్లను గుర్తించి సీపీ రష్మి పెరుమాళ్ మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు. ప్రతిభ చూపిన సిబ్బందికి ప్రశంసా పూర్వకంగా చేతి గడియారాలు మరియు ఉన్నత నాణ్యత కలిగిన పరుగు పందెం పాదరక్షలను ఆమె అందజేశారు. పోలీసు సిబ్బంది సమగ్ర వికాసానికి, మానసిక ఉల్లాసానికి ఈ ప్రాజెక్ట్ ఎంతగానో ఉపయోగపడుతోందని కానిస్టేబుళ్లు హర్షం వ్యక్తం చేయగా, సిబ్బంది శారీరక దృఢత్వంతో పాటు ఆధునిక, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవడమే లక్ష్యమని, దీనివల్ల వారిలో ఆత్మవిశ్వాసం రెట్టింపు అవుతుందని సీపీ స్పష్టం చేశారు.

# కోటి రూపాయల పర్యాటక భవనం నిరుపయోగం

**అచ్చంపేట, అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి):**



శ్రీశైలం ఉత్తర ద్వారంగా పేరుగాంచిన మండల పరిధిలోని ఉమామహేశ్వరం దేవస్థానం ఎంతో ప్రసిద్ధి చెందింది. పురాతన చరిత్ర కలిగిన ఈ క్షేత్రం నిత్యం భక్తులతో రద్దీగా ఉంటుంది. పర్యాటకులకు వసతి, భోజన సౌకర్యం కల్పించేందుకు పర్యాటక శాఖ కోటి రూపాయలు ఖర్చు చేసి అతిథి గృహాన్ని నిర్మించింది.అయితే గత పదేళ్లుగా దీనిని వినియోగించకపోవడంతో భవనం పూర్తిగా నిరుపయోగంగా మారింది. గదుల్లో తలుపులు, కిటికీలు ఊడిపోయాయి. పరిసరాలంతా చెట్లు, పొదలతో నిండిపోయి శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ప్రజాధనం వృథా అయిందని స్థానికులు, భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రతి ఏడాది ఉమా మహేశ్వర బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతాయి. రంగాపూర్ ఉర్సు జాతర సమయంలోనూ భక్తులు, పర్యాటకులతో ఈ ప్రాంతం కిక్కిరిసిపోతుంది. మహబూబ్ నగర్, నల్గొండ, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి భారీగా భక్తులు తరలివస్తారు. ఆ సమయంలో అతిథి గృహం అందుబాటులో ఉంటే భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉండడంతో పాటు పర్యాటక శాఖకు ఆదాయం కూడా వస్తుంది. కానీ అధికారులు ఆ దిశగా ఆలోచన చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే కోటి రూపాయల భవనం శిథిలావస్థకు చేరుకుందని పర్యాటకులు, భక్తులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా పర్యాటక శాఖ అధికారులు స్పందించి శిథిలమైన భవనానికి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

# సర్వే నంబర్ 255లో అక్రమ లేఅవుట్ బాగోతం!

**అనుమతులు లేకుండానే ప్లాట్ల విక్రయాలు.. ఆరు షట్టర్ల నిర్మాణాలు?**
**ఫిర్యాదులతో కదిలిన అధికారులు..**
**రెండు నోటీసులు జారీ**
**రిజిస్ట్రేషన్లు చేయొద్దంటూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి లేఖ**

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 13: వుదయం.**



సంగారెడ్డి జిల్లా అందోల్ మండలంలో ని పోసానిపేట శివారులోని టీచర్స్ కాలనీ పక్కన సర్వే నంబర్ 255లో వ్యవసాయ భూమిని నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లుగా చేసి విక్రయించారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. లేఅవుట్ అనుమతులు పొందకుండానే ప్లాట్ల విక్రయాలు చేపట్టడంతో పాటు, కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా నిర్మాణాలు చేపట్టినట్లు ఫిర్యాదులు వెల్లువెత్తాయి.మూడు ఎకరాల భూమిలో అక్రమాలెన్నో!స్థానికుల ఫిర్యాదు ప్రకారం.. దివంగత పులుగు కిష్టయ్య భార్య పులుగు లక్ష్మీబాయి, మన్నాన్‌పల్లి మల్లికార్జున్ కుటుంబ సభ్యులకు సంబంధించినదిగా పేర్కొంటున్న సర్వే నంబర్ 255లోని 3 ఎకరాల 8 గుంటల వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చకముందే, లేఅవుట్ అనుమతులు లేకుండా ప్లాట్లుగా విభజించి విక్రయించినట్లు ఆరోపణలున్నాయి.గ్రామపంచాయతీకి అవసరమైన ఫీజులు చెల్లించకపోవడం, భూమిని నిబంధనల ప్రకారం మార్ట్‌గేజ్ చేయకపోవడం, చిల్డ్రన్ పార్కు ఏర్పాటు చేయకపోవడం, రహదారులు వేయకపోవడం, నీటి సదుపాయాల కోసం బోర్లు ఏర్పాటు చేయకపోవడం వంటి అంశాలు వివాదానికి కారణమయ్యాయి. సంబంధిత అధికారుల అనుమతులు లేకుండానే సుమారు ఆరు షట్టర్లతో కూడిన భవనాలు నిర్మించినట్లు ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులతో అధికారుల్లో కదలికఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ), డీఎల్‌పీఓ తదితర అధికారులకు ఫిర్యాదులు అందినట్లు సమాచారం. ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు విచారణ చేపట్టి, అక్కడి షట్టర్లు, భవనాల యజమానులకు రెండు విడతలుగా నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది.అయితే, ఇప్పటివరకు నోటీసులకు సంబంధించి తమకు ఎలాంటి వివరణ అందలేదని అధికారులు తెలిపినట్లు ఫిర్యాదుదారులు పేర్కొంటున్నారు. రిజిస్ట్రేషన్లపై ఆంక్షలు?సర్వే నంబర్ 255లోని భూముల క్రయవిక్రయాలపై అభ్యంతరాలు వ్యక్తమవడంతో, ఆయా భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్లు చేయవద్దని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి అదనపు కలెక్టర్, డీపీఓ, డీఎల్‌పీఓల నుంచి లేఖ పంపినట్లు సమాచారం. మరోవైపు, సర్వే నంబర్ 255లోని ప్లాట్లను కొనుగోలు చేయడం, విక్రయించడం చేయవద్దంటూ పోసానిపేట గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిసింది.అక్రమ నిర్మాణాలపై చర్యలెప్పుడు?అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలపై తదుపరి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికే రెండు నోటీసులు జారీ చేసిన అధికారులు, తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. అవసరమైన చట్టపరమైన ప్రక్రియ పూర్తయిన తర్వాత అక్రమ నిర్మాణాల తొలగింపుపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి ఆధారాలతో త్వరలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించనున్నట్లు ఫిర్యాదుదారులు తెలిపారు.అధికారుల విచారణలో అక్రమాలు నిర్ధారణ అవుతాయా? బాధ్యులపై చర్యలు తీసుకుంటారా? అనేది వేచి చూడాలి.

# సమర్ధవంతంగా పారదర్శకంగా జనగణన ప్రక్రియ

**వికారాబాద్ (వుదయం )అక్టోబర్ 13:**

జనగణన-2027 రెండో దశపై ఛార్జ్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లకు మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటాచారి మాట్లాడుతూ...దేశ ప్రతిష్టను ఇనుమడించే ప్రక్రియలో పాల్గొని పనిచేయడం అదృష్టంగా భావించాలన్నారు. జనగణ ప్రక్రియలో నిర్లక్ష్యం వహించకుండా చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. జనగణనలో సేకరించే వివరాలు కచ్చితంగా ఉండేలా చూడాలని, ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఛార్జ్ క్లర్కులు ,టెక్నికల్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి సందేహాలను నివృత్తి చేసుకొని తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా చేపట్టాలని ఆయన సూచించారు. జనగణన విజయవంతంగా నిర్వహించడంలో శిక్షణ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని ఆయన తెలిపారు. జిల్లాలో ఇంటి జాబితా తయారీ ప్రక్రియకు మొదటి దశలో 2028 ఇండ్ల జాబితా బ్లాకులు ఏర్పడ్డాయని, 1600 మంది ఎన్యూమరేటర్లు, 271 మంది సూపర్వైజర్ లు విధులు నిర్వహించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా జనగణన రెండో దశకు సంబంధించిన విధివిధానాలు, అధికారుల బాధ్యతలు, డిజిటల్ పద్ధతిలో సమాచార సేకరణ, సాంకేతిక సాధనాల వినియోగం, డేటా నమోదు మరియు సమాచార గోప్యతకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సిపిఓ వెంకటేశ్వర్లు, ప్రణాళిక శాఖ రిటైర్డ్ డైరెక్టర్ దయానంద్, ఏడి రవిచంద్ర, శిక్షణాధికారి జంగయ్య సంబంధిత అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# పరకాలకు జిల్లా హోదా ఎందుకు కల్పించలేదు? బీఆర్ఎస్‌కు బీజేపీ నేత ఆకుల శ్రీధర్ సవాల్!



**పరకాల జిల్లా హోదాపై బహిరంగ చర్చకు సిద్ధం..**
**తేదీ, సమయం ప్రకటించాలి..**

**పరకాల అక్టోబర్ 12 (వుదయం ప్రతినిధి):**
పరకాలకు జిల్లా హోదా కల్పించడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు విఫలమైందో ప్రజలకు సమాధానం చెప్పాలని బీజేపీ జిల్లా నాయకుడు ఆకుల శ్రీధర్ డిమాండ్ చేశారు. బీజేపీపై విమర్శలు చేసే ముందు పదేళ్ల పాలనలో పరకాల అభివృద్ధికి, జిల్లా హోదా సాధనకు చేసిన కృషిపై బీఆర్ఎస్ నాయకులు స్పష్టత ఇవ్వాలని అన్నారు. పరకాల జిల్లా హోదా, అభివృద్ధి అంశాలపై బహిరంగ చర్చకు బీజేపీ సిద్ధంగా ఉందని ప్రకటించారు. బీఆర్ఎస్ నాయకులు చర్చకు సిద్ధమైతే తేదీ, సమయం, స్థలాన్ని ప్రకటించాలని ఆకుల శ్రీధర్ సవాల్ విసిరారు. తెలంగాణలో 33 జిల్లాలను ఏర్పాటు చేశామని చెప్పుకునే బీఆర్ఎస్ నాయకులు, చారిత్రక నేపథ్యం కలిగిన పరకాలను అమరవీరుల జిల్లాగా ప్రకటించడంలో ఎందుకు విఫలమయ్యారో వివరించాలని కోరారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా అవకాశం పొందిన మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి.. జిల్లాల పునర్విభజన సమయంలో పరకాల ప్రజల ఆకాంక్షను ఎందుకు నెరవేర్చలేకపోయారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పరకాలకు జిల్లా హోదా వస్తుందని వ్యాపారులు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని పేర్కొన్నారు. 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, రెవెన్యూ డివిజన్ సహా కీలక అంశాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకాలు చేసినంత మాత్రాన పరకాలకు జిల్లా హోదా వస్తుందా? అని ప్రశ్నించారు. అభివృద్ధిపై ఆధారాలతో చర్చకు సిద్ధం పరకాల జిల్లా హోదా, ప్రభుత్వ ఆసుపత్రి, విద్యా సదుపాయాలు, రహదారులు, ఇతర అభివృద్ధి పనులపై గత పాలనలో సాధించిన ఫలితాలు, నెరవేరని హామీలను ప్రజల సమక్షంలో ఆధారాలతో చర్చించేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని ఆకుల శ్రీధర్ తెలిపారు. బీజేపీని విమర్శించే ముందు పరకాలకు జిల్లా హోదా ఎందుకు తీసుకురాలేకపోయారో బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలని కోరారు. పరకాల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, అమరవీరుల జిల్లాగా గుర్తింపు సాధించే లక్ష్యంతో ప్రజల పక్షాన బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని ఆకుల శ్రీధర్ స్పష్టం చేశారు.

# ఎమ్మెల్సీ మండల కో ఆర్డినేటర్ గా తప్పేట రమేష్



**ముఖ్య అతిధిగా పాల్గొన్న నర్సంపేట ఎమ్మెల్సీ కో ఆర్డినేటర్ సతీష్ రెడ్డి**

**చెన్నారావుపేట అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి ) :**
చెన్నారావుపేట మండల ఎమ్మెల్సీ మండల కో ఆర్డినేటర్ గా కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తప్పేట రమేష్ ని ఎన్నుకున్నట్టు నర్సంపేట ఎమ్మెల్సీ కో ఆర్డినేటర్ సతీష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రోజు కాంగ్రెస్ మండల కార్యాలయంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిద్దన రమేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి గారి ఆదేశాల మేరకు నర్సంపేట ఎమ్మెల్సీ సతీష్ రెడ్డి పాల్గొని మాట్లాడారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నారావు పేట మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తం రెడ్డి గెలుపుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నాయకులు కార్యకర్తలు మద్దతు తెలిపి గెలిపించుకోవాలని కోరారు..ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్లు భూక్య గోపాల్ నాయక్ మొగిలి వెంకట్ రెడ్డి మాజీ ఎంపీపీ కేతిడి వీరా రెడ్డి ఉప సర్పంచ్ దొంతి శ్రీను సొసైటీ డైరెక్టర్ మంద యాకయ్య గౌడ్ మార్కెట్ డైరెక్టర్ కోరే కుమార స్వామి యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఉప సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు బండి హరీష్ ఉప సర్పంచ్ కొర్ర మోహన్ కుండే కుమార స్వామి తోట రాము కొమురయ్య తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా సిరికొండ జన్మదిన వేడుకలు



**చిట్యాల, అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి):**
తెలంగాణ తొలి శాసనసభాపతి ఎమ్మెల్సీ, శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి జన్మదిన వేడుకలను మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.మండలంలోని అన్ని గ్రామాలలో మధుసూదనాచారి జన్మదిన వేడుకలు నిర్వహించిన అనంతరం బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు చింతల రమేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో చిట్యాల మండల కేంద్రం చౌరస్తాలో కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదనాచారికి శుభాకాంక్షలు తెలుపుతూ నిండు నూరేళ్లు ఉన్నత పదవులతో ఎదగాలని ప్రార్థిస్తూ టపాసులు పేల్చి నినాదాలు చేశారు. అనంతరం స్థానిక ఆసుపత్రిలోని రోగులకు పండ్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రమేష్ ముదిరాజ్, మండల యూత్ కమిటీ మాజీ అధ్యక్షుడు జన్నె యుగంధర్ మాట్లాడుతూ భూపాలపల్లి జిల్లా ఏర్పాటు కేవలం సిరికొండ మధుసూదనాచారితో మాత్రమే సాధ్యమైందని అన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలను జిల్లా కేంద్రానికి తీసుకువచ్చి, ఎనిమిది కిలోమీటర్ల పాటు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు సౌకర్యాలు కల్పించారని తెలిపారు. చిట్యాలలో 50 పడకల ఆసుపత్రి, జిల్లా కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి ఆయన కృషి వల్లనే వచ్చాయని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి అద్భుతమైన అభివృద్ధిని సాధించారని కొనియాడారు. కొన్ని కారణాల వల్ల ఓటమిపాలైనా భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం నేటికీ ఆయన కృషి చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కన్నెబోయిన అశోక్, కొత్త శ్రీను, జెంబుల చంద్రమౌళి, సంగ రాజేందర్, ఎండి శంషుద్దీన్, ఎజ్జిగిరి ఆనందం, గురుకుంట్ల కిరణ్, ఉప్పుల కిరణ్, రాయని శ్రీకాంత్, నల్ల నవీన్, తీగల బాలకృష్ణ, ఆనందా చారి, మోతుకూరి సంతోష్, వేముల హరీష్, భయగాని గణపతి, బొట్ల రవి, బొంకూరి సమ్మయ్య, కార్త్రేవుల రాజయ్య, ఆర్.ఎం.పి భాస్కర్, నేరెళ్ల ఓదెలు, మండల రాజేష్, బండి తిరుపతి, గుర్రం విజేందర్, కోడెల రాజమల్లు, గుర్రం సుశ్రిత్, రాజు నాయక్, మల్లయ్య, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో దాడి

**కేసు నమోదు చేసిన పోలీసులు**

హసన్ పర్తి అక్టోబర్13 (వుదయం ప్రతినిధి): హసన్ పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం మత్తులో దాడి చేసి, భయానక వాతావరణం సృష్టించిన వ్యక్తుల పై కేసు నమోదు చేసినట్లు ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఏ. మహేందర్ తెలిపారు. తాళ్ల నేపాల్ @ సంతోష్ / సదానందం, పప్పుల హరిప్రసాద్, పోతరాజు సుజిత్, మట్టెడ శ్రీకాంత్ మరియు మరో వ్యక్తి కలిసి వారాల స్మశాన వాటిక వద్ద మంగళ వారం మద్యం సేవించారు. అనంతరం వారు స్థానికంగా ఉన్న సూరయ్య ఇంట్లోకి చొరబడి, ఇంటి ముందున్న నీటి సంపు వద్ద అసభ్యకరంగా ప్రవర్తించారు.
ఇంట్లో ఉన్న సూరయ్య కోడలు హారిక భయంతో కేకలు వేయగా, అక్కడే ఆవులను మేపుతున్న పావుశెట్టి వేణుమాధవ్ (65) వారిని నిలదీశారు. దాంతో నిందితులు ఆవేశంలో వేణుమాధవ్ మరియు ఆయనను కాపాడటానికి వచ్చిన రత్నాకర్ పై విచక్షణా రహితంగా దాడి చేసి, బూతులు తిట్టారు. కనపర్తి కిరణ్ వారిని అడ్డుకుని విడిపించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హసన్ పర్తి ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఏ. మహేందర్ తెలిపారు.

# మండల సమన్వయకర్తగా మాండురి మహేందర్



**ఆసిఫాబాద్ ( వుదయం ప్రతినిధి ) :**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బీజేపీ ఎండోమెంట్ ధార్మిక సెల్ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా నూతన కార్యవర్గ సమావేశం ఇటీవల ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుల ఆదేశాల మేరకు జిల్లా, మండల స్థాయిలో నూతన నియామక పత్రాలను అందజేశారు.ఇందులో భాగంగా ఆసిఫాబాద్ జిల్లా, కాగజ్ నగర్ నియోజకవర్గం, బెజ్జూర్ మండల సమన్వయ కర్తగా మాండూరి మహేందర్ నియమితులయ్యారు. రాష్ట్ర కన్వీనర్ అన్నవజ్జుల సూర్యప్రకాష్, కోకన్వీనర్ నిరంజన్ దేశాయ్ సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు బిజెపి జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం డీజే వైఎం జిల్లా ఉప అధ్యక్షులు ఉమ్మెర బాలకృష్ణయాదవ్ ల సూచనలతో ఈ నియామకం చేపట్టారు.ఈ సందర్భంగా జిల్లా నాయకులు మాట్లాడుతూ, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, ధార్మిక క్షేత్రాల పరిరక్షణకు, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.నియామకం పట్ల మాండూరి మహేందర్ హర్షం వ్యక్తం చేస్తూ, తనపై నమ్మకం ఉంచిన బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# పోలీసులపై దాడి.. 20 మంది అరెస్ట్

**విధులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు**
**ఎస్పీ అఖిల్ మహాజన్**

**ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 13:**
గంజాయి కేసు దర్యాప్తు కోసం వెళ్లిన పోలీసులపై దాడికి పాల్పడిన ఘటనలో 20 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం ఏడుగురిని అరెస్ట్ చేయగా, మంగళవారం మరో 13 మందిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. స్థానిక పోలీసు ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఘటన వివరాలను వెల్లడించారు. సిరికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని వాయిపేట్ గ్రామంలో ఈ నెల 10న ఈ ఘటన జరిగినట్లు ఎస్పీ తెలిపారు. సిరికొండ పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నంబర్ 90/2026కు సంబంధించి గంజాయి కేసు దర్యాప్తు కోసం ఇచ్చోడ సీఐ సీహెచ్. రమేష్, కానిస్టేబుల్ బత్తుల శివప్రసాద్‌తో పాటు మరో ముగ్గురు పోలీసు సిబ్బంది ప్రభుత్వ వాహనంలో బంగారుపేట గ్రామానికి వెళ్లినట్లు వివరించారు. గంజాయి కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన నేపథ్యంలో కొందరు వ్యక్తులు గుంపుగా ఏర్పడి పోలీసులపై దాడికి పాల్పడినట్లు తెలిపారు. పోలీసులపై రాళ్లు రువ్వడంతోపాటు కర్రలతో దాడి చేసి గాయపరిచారని, అనంతరం వారిని బలవంతంగా సర్పంచ్ ఇంటికి తీసుకెళ్లి నిర్బంధించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని వివరించారు.దాడి సమయంలో పోలీసులను చంపుతామని బెదిరించడంతోపాటు ప్రభుత్వ పోలీసు వాహనాన్ని, ప్రభుత్వ ఫోన్‌ను ధ్వంసం చేసినట్లు ఎస్పీ తెలిపారు. మరో సెల్‌ఫోన్, క్రైమ్ నంబర్ 79/2026కు సంబంధించిన సీడీ ఫైల్‌ను అపహరించినట్లు వెల్లడించారు.ఈ ఘటనలో కానిస్టేబుల్ బత్తుల శివప్రసాద్ ఎడమ చేతి ఎముక విరిగిందని ఎస్పీ తెలిపారు. ఇచ్చోడ సీఐ సీహెచ్. రమేష్‌కు భుజం, వీపు భాగాల్లో గాయాలయ్యాయని పేర్కొన్నారు. ఏఎస్ఐ రాథోడ్ బలిరామ్‌కు ఎడమ చేయి, తొడ, భుజం వద్ద గాయాలైనట్లు వివరించారు. ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ భీంరావుకు కుడి చేయి, నడుము భాగాల్లో గాయాలు కాగా, ఏఆర్ కానిస్టేబుల్ గంగారాంకు తలపై రక్తస్రావ గాయమైందని తెలిపారు. కానిస్టేబుల్ బత్తుల శివప్రసాద్ ఫిర్యాదు మేరకు సిరికొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

# ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు కార్యాచరణ



**గ్రామాల వారీగా పంటల పరిస్థితిని అంచనా వేయాలి.**
**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద.**

**వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి అక్టోబర్ 13.**
ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో వ్యవసాయ రంగంపై పడే ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి, రైతులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ, గ్రామాల వారీగా పంటల పరిస్థితి, నీటి లభ్యతపై సమగ్ర అంచనా వేయాలని సూచించారు. నీటి కొరత ఏర్పడే అవకాశమున్న ప్రాంతాలను, పంటలు ఎండిపోయే పరిస్థితులున్న గ్రామాలను క్షేత్రస్థాయిలో గుర్తించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, ఇందుకోసం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. వర్షపాతం, భూగర్భ జలాల పరిస్థితి, సాగునీటి వనరుల లభ్యతకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించి, రానున్న వ్యవసాయ సీజన్‌లో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు. వ్యవసాయ, నీటిపారుదల, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. వాతావరణ అంచనాలను నిరంతరం పరిశీలిస్తూ, పరిస్థితులకు అనుగుణంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులకు ఎప్పటికప్పుడు అవసరమైన సూచనలు అందిస్తూ, పంట నష్టాన్ని నివారించేందుకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.
ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్ రావు, డీఆర్డీవో నాగ పద్మజ, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బాలాజీ, సీపీఓ చంద్రకళ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# చింత నెక్కొండ గ్రామీణ హితకారిణి సేవా సంఘం శ్రమదానం





**పర్వతగిరి , అక్టోబర్ 13 ( వుదయం ప్రతినిధి ):**
పర్వతగిరి మండలం చింత నెక్కొండ గ్రామపంచాయతీ అంతర్గత రహదారుల పరిశుభ్రతకై చింత నెక్కొండ హితకారిణి సేవా సంఘ వ్యవస్థాపకులు ఘటిక మల్లయ్య ఆధ్వర్యంలో మంగళవారం శ్రమదానం చేయనైనది. ఈ శ్రమదాన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గాడుదుల రమేష్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ సెక్రెటరీ సుధాకర్ సార్,11వ వార్డు మెంబర్ లాక రమేష్, చౌటపల్లి సొసైటీ డైరెక్టర్ ఓరుగంటి శ్రీనివాస్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దబ్బేట నర్సయ్య, హితకారిణి సేవా సంఘం చింత నెక్కొండ బ్రాంచ్ ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ దబ్బేట నరసింహులు, ఘటిక స్వామి,నాగేల్లి ఉప్పలయ్య,దబ్బేట రత్నం,శేఖర్,గ్రామ పంచాయతీ సిబ్బంది,తదితరులు శ్రమదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. సర్పంచ్ గాడుదుల రమేష్ యాదవ్ మాట్లాడుతూ ఇతకారిని సేవా సంఘ శ్రమదాన కార్యక్రమాన్ని స్వాగతం పలుకుతూ శ్రమదాన కార్యక్రమం చేపట్టడం అర్షనీయమని పేర్కొన్నారు. హితకారిణి సేవా సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు ఘటిక మల్లయ్య గారు మాట్లాడుతూ చింత నెక్కొండ గ్రామంలో పారిశుద్ధ్య విషయం గా గ్రామపంచాయతీ, స్వచ్ఛంద సంస్థలు, యువజనులు, ప్రజాప్రతినిధులు ప్రజలను చైతన్య పరిచి ఎప్పటికప్పుడు రహదారులపై పేరుకుపోయిన చెత్తాచెదారం,మట్టి కుప్పలను,తదితర ఆటంకాలను తొలగించుకొని గ్రామ పరిశుభ్రతకై పాటుపడాలని పిలుపునిచ్చారు.

# పునః ప్రారంభమైన కురాళ్ల బావి



**వందల సంవత్సరాల బావిని ప్రారంభించిన శ్రీ దుర్గాదేవి ఉత్సవ కమిటీ**

**హసన్ పర్తి అక్టోబర్13 (వుదయం ప్రతినిధి):**
హసన్ పర్తి 66వ డివిజన్ గణేష్ నగర్ లోని విజయ గార్డెన్స్ సమీపం లోని కురాళ్ల బావిని శ్రీ దుర్గాదేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పురోహితులు దహంగం రమేష్ శర్మ వేద మంత్రాలతో పునః ప్రారంభించారు. గణేష్ నగర్ లోని మహిళలు మంగళ హారతులతో కురాళ బావి కి పూజలు నిర్వహించారు. గణేష్ నగర్ లోని కురాళ్ళ బావికి వందల సంవత్సరాల చరిత్ర కలదు. హసన్ పర్తి లో జరిగే పెండ్లిలకు ఈ బావి వద్ద ముందు రోజు కురాళ్లు పట్టడం ఆనవాయితీగా ఉండేది. కొన్ని కారణాల వలన ఈ బావి కొద్ది రోజులు నిరుపయోగంగా ఉంటుది. ఇది గుర్తించిన శ్రీ దుర్గాదేవి ఉత్సవ కమిటీ సభ్యులు కురాళ్ల బావిని శాస్త్ర పరంగా పూజలు నిర్వహించి పునః ప్రారంభించారు. ఈ బావి నీ కురాళ్ళ బావి, మంచి నీళ్ల బావి, బోడా బావి అనే పేర్లతో పిలుస్తుంటారు.
ఇంతకు ముందు ఈ బావి నీటిని త్రాగడానికి కూడా ఉపయోగించే వారు. ఎల్ నీనో ద్వారా ప్రస్తుతం డివిజన్ లోని కొన్ని కాలనీలలో నీళ్లు లేక ఇబ్బందులు పడుతుండటంతో ఈ బావి నుండి ట్యాంకర్లతో నీటి తీసుకుపోయి పలు కాలనీలలో వాడుకుంటున్నారు. పురాతన బావి నీ పునః ప్రారంభించిన శ్రీ దుర్గాదేవి ఉత్సవ కమిటీ సభ్యులను డివిజన్ లోని ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల రవీందర్, దాది మధుసూదన్, దాది రాజు, రాజేశ్వర్, వేణుగోపాల్, నాగరాజు, గరిగె శ్రీనివాస్, గరిగె నాగార్జున, ఎర్రగట్టు గుట్ట దేవస్థాన ధర్మకర్త గరిగె రమ్యక్రిష్ణ రాజు, తోట సంపత్, కన్నయ్య, రాకేష్, టి. రాజు, కామేశ్వర్ రెడ్డి, కోటి, వడ్డేపల్లి శ్రీనివాస్, యుగంధర్, కాలనీ మహిళలు సరోజన, రజినీ, రజిత, కొమురమ్మ, సాంబలక్ష్మి, సింధూ, పద్మ, సుజాత, మంజుల, జ్యోతి, సౌమ్య, స్వప్న, దీపిక తదితరులు పాల్గొన్నారు.

# కొత్త సర్పంచుల ఫోరం కార్యవర్గం నీ ఘనంగా ఎంపీడీవో సన్మానం



**రాయపర్తి అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి):**
రాయపర్తిమండల సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గ ఎన్నిక సోమవారం ఏకగ్రీవంగా జరిగింది. ఈ సమావేశంలో మండలంలోని సర్పంచులందరూ పాల్గొని నూతన అధ్యక్షునిగా పెండ్లి మహేందర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అనంతరం ఫోరం ఇతర పదాధికారులను కూడా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా సూదుల ఉమాదేవి దేవేందర్,దేదావత్గోపాల్, గుగులోతు రమేష్, కందికట్ల స్వప్న, ప్రధాన కార్యదర్శిగా తీగల సాయిలు, కోశాధికారిగా మూనావత్ బాద్యా, సంయుక్త కార్యదర్శిగా సుధాకర్ గుజే, కార్యదర్శులుగా సక్రి, శీలా హేమలత, రత్నాకర్ రెడ్డి, ముఖ్య సలహాదారుగా హలవత్ సోమా గ్యారే సహింద్ర లను ఎన్నుకున్నారు.నూతనంగా ఎన్నికైన కార్యవర్గం ఆధ్వర్యంలో ఎంపీడీవో గారిని ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ.. సర్పంచులందరూ ఐక్యతతో ఉండాలని, గ్రామాల్లో అభివృద్ధి పనులలో చురుగ్గా పాల్గొని గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి గడపకు చేరేలా సర్పంచులు బాధ్యతగా పని చేయాలని పిలుపునిచ్చారు.నూతన అధ్యక్షుడు పెండ్లి మహేందర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన ప్రతి సర్పంచుకు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచుల సమస్యల పరిష్కారానికి, గ్రామాల అభివృద్ధికి ఫోరం తరపున నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



**-మందమర్రి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ**

**మందమర్రి,అక్టోబర్13(వుదయం):**
సింగరేణి సంస్థ వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రత్యేక స్వచ్ఛత కార్యక్రమం6 లో భాగంగా మందమర్రి ఏరియాలోని కేకే2 బంగ్లా ప్రాంగణంలో శ్రమదానం,పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై, కార్యక్రమాన్ని ప్రారంభించారు.కేకే2 బంగ్లాస్ ప్రాంగణంలో పెరిగిన పిచ్చి మొక్కలు, ముండ్ల పొదలను తొలగించడంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు, కాగితాలు, ఎండిన ఆకులు,ఇతర చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. జీఎం రాధాకృష్ణ స్వయంగా చీపురు పట్టి పరిసరాలను శుభ్రం చేస్తూ ఉద్యోగులకు, అధికారులకు స్ఫూర్తిగా నిలిచారు.
ఈ సందర్భంగా మందమర్రి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ అనేది ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత. భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు మనమందరం కృషి చేయాలి. రోజువారీ జీవితంలో ప్లాస్టిక్ వినియోగాన్ని వీలైనంతగా తగ్గించడం, అలాగే మందమర్రి ఏరియాలోని అన్ని గనులు (Mines), డిపార్ట్‌మెంట్లు, కార్యాలయాలు,నివాస ప్రాంతాల్లో ఈ ప్రత్యేక స్వచ్ఛత కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 31 నాటికి మందమర్రి ఏరియాలోని అన్ని ప్రాంతాలను పర్యావరణ హితంగా తీర్చిదిద్దాలని ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ (ఈ అండ్ ఎం) బాలాజీ భగవతి జ, డి జి ఎం (ఐ ఈ డి) కిరణ్ కుమార్, ఏ ఎస్ ఓ, మురళి, ఎన్విరాన్మెంట్ అధికారి వెంకట్ రెడ్డి, ఫారెస్ట్ అధికారి నవీన్, డీజీఎం (సివిల్) మదీనా భాష, పర్చేస్ అధికారి బాబు, ఐ టీ డీవై మేనేజర్ రవి, సీనియర్ పిఓ సురేందర్ మందమర్రి ఏరియా వివిధ విభాగాల అధికారులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పఖీరా తండాలో నూతన పెన్షన్ల సూపర్ చెకింగ్



**నర్సింహులపేట, అక్టోబర్13 (వుదయం ప్రతినిధి):**
మహబూబాబాద్ జిల్లా, నర్సింహులపేట: మండలంలోని పఖీరా తండా గ్రామ పంచాయతీలో ఇటీవల మంజూరైన పెన్షన్లను జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేక అధికారి రేవంత్ మంగళవారం సూపర్ చెకింగ్ నిర్వహించారు. ఎంపీవో బండి అశోక్‌తో కలిసి పెన్షన్ లబ్ధిదారుల వివరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుగులోతు కైలారవి, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి బానోతు సరిత తదితరులు పాల్గొన్నారు.

# ఎంపిడివో ని మార్యద పూర్వకంగా కలిసిన లింగగిరి వార్డు సభ్యులు



**చెన్నారావుపేట అక్టోబర్ 13 ( వుదయం ప్రతినిధ ):**
చెన్నారావుపేట మండలం లింగగిరి గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు ఎంపిడివో సాయి శివానంద్ ని మర్యాద పూర్వకంగా కలిసారు. లింగగిరి గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు గా ఎన్నికైన ఉప సర్పంచ్ గా పదవి బాధ్యతలు చేపట్టిన గ్రామ ఉప సర్పంచ్ సప్పిడి ప్రియాంక గత నాలుగు నెలలుగా జనరల్ బాడీ సమావేశం గ్రామ సభలకు హాజరు కావడం లేదని పలువురు వార్డ్ సభ్యులు ఈ రోజు మండల పంచాయతీ అభివృద్ధి అధికారి సాయి శివా నంద్ ని కలిసి పిర్యాదు చేసారు. ఈ సందర్భంగా వారు గ్రామ పంచాయతీ సమావేశాలకు రాని ఉప సర్పంచ్ ని తక్షణమే విధుల నుండి తప్పించె విధంగా చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్సి సెల్ జిల్లా వైస్ చైర్మన్ మాదారపు చరణ్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు మంద సోమయ్య సీనియర్ నాయకులు చీకటి పెద్ద రాజు వార్డు సభ్యులు మల్లం సాగర్ తాడేం ప్రభాకర్ పెరుమాండ్ల సునీత ఈసం పెళ్లి మమత ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రఘంట దేవి అవతారంలో కనకదుర్గమ్మ, మదన పోచమ్మ



**పరకాల అక్టోబర్ 12 (వుదయం ప్రతినిది):**
పట్టణంలోని కనకదుర్గమ్మ, మదన పోచమ్మ ఆలయాల్లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు అమ్మవారు చంద్రఘంట దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి తరలివచ్చారు.
ఈ సందర్భంగా వేద పండితులు మణిదీప్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దేవునూరి మేఘనాథ్, నాగెల్లి రంజిత్, ఇంగిలి వీరేష్ రావు, మూసినిపల్లి శివప్రసాద్, పచ్చిక శంతన్ రెడ్డి, రాజేష్ గంగు, కృపేందర్ రెడ్డి, నిఖిల్, సాయి, వరప్రసాద్, రాకేష్, రాజేంద్రప్రసాద్, శివ తదితరులు పాల్గొన్నారు.

## ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గడ్డం రాజును పరామర్శించిన మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్



**మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచన**
**త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష**

**కాజిపేట్ అక్టోబర్ 13 ( వుదయం ప్రతినిధి):**
48 డివిజన్ జనరల్ సెక్రెటరీ గడ్డం రాజు ఆరోగ్య పరిస్థితిని మాజీ ప్రభుత్వ చీఫ్ దాస్యం వినయ్ భాస్కర్ గారు అడిగి తెలుసుకున్నారు, అనారోగ్య కారణాలతో ప్రస్తుతం స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజు గారిని దాస్యం వినయ్ భాస్కర్ గారు మంగళవారం పరామర్శించారు హాస్పిటల్ కి వెళ్లి రాజు గారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో ప్రత్యేకంగా మాట్లాడారు రాజు మళ్లీ ప్రజాసేవలోకి రావాలని ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ గారు ఆకాంక్షించారు ఆయన వెంట పలువురు స్థానిక నాయకులు కార్యకర్తలు ఉన్నారు

# ముత్యం రవి మృతదేహానికి నివాళులు అర్పించిన డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్



**నర్సంపేట వుదయం ప్రతినిధి అక్టోబర్ 13.**
వరంగల్ జిల్లా నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని ద్వారకపేట 7వ వార్డుకు చెందిన ముత్యం రవి ముదిరాజ్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు, నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ రవి పార్థివదేహానికి
పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నర్సంపేట మండల కార్యదర్శి నూనె రంజిత్ కుమార్ ముదిరాజ్, మారపాక రమేష్ ముదిరాజ్, ముదిరాజ్ కుల సంఘం నాయకులు మిట్టపల్లి శ్రీనివాస్ ముదిరాజ్, నూనె కుమారస్వామి ముదిరాజ్, వేమ స్వామి, సంగినేని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, భూసాని శివకుమార్ ముదిరాజ్, కూరాకుల నవీన్, కట్టయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సీనియర్ కమ్యూనిస్టు నేత మర్ద లక్ష్మీనర్సుకు బీఆర్ఎస్ నివాళి



**నర్సంపేట వుదయం ప్రతినిధి అక్టోబర్ 13.**
గురిజాల గ్రామానికి చెందిన ప్రముఖ సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు మర్ద లక్ష్మీనర్సు అకాల మరణం చెందడంతో గురిజాల బీఆర్ఎస్ గ్రామ కమిటీ నాయకులు ఆయన పార్థివ దేహంపై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. లక్ష్మీనర్సు మృతి పట్ల వారు విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మోటం రవి అడ్వకేట్, బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఐ రాజేష్ రెడ్డికి ఘనంగా వీడుకోలు పలికిన సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ సభ్యులు



**చెన్నారావుపేట అక్టోబర్ 13 ( వుదయం ప్రతినిధి ):**
మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో పని చేస్తున్న గంద్రాతి రాజేష్ రెడ్డి బదిలీ అయి వరంగల్ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ కు బదిలీ అయిన సందర్భంగా వరంగల్జిల్లా సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు కాట కుమారస్వామి ప్రధాన కార్యదర్శి, సీనియర్ పాత్రికేయులు మన్యం వీరేందర్ రెడ్డి దుగ్గొండి మండల అధ్యక్షుడు గూడెపు అమరేందర్ చెన్నారావుపేట ప్రధాన కార్యదర్శి
చెలుకల పెల్లి రాజు,రమేష్,కొయ్యల భాస్కర్,నూనె తిలక్ తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్పీగా ధరావత్ సబిత నాయక్‌ని అభినందించిన గిరిజన సర్పంచ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు భూక్య సంతోష్ నాయక్

**యాదాద్రి భువనగిరి జిల్లా, వుదయం ప్రతినిధి**

యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం లోని రామోజీ నాయక్ తండ కు చెందిన ధరావత్ సబిత నాయక్ గారు తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్ వన్ లో డిసిపి గా నియామక పత్రం అందుకోవడం జరిగింది, వారిని తెలంగాణ గిరిజన సర్పంచ్ ఫోరం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు భూక్య సంతోష్ నాయక్ మరియు రాష్ట్ర కార్యదర్శి ధరావత్ సతీష్ నాయక్ గారు మాట్లాడుతూ, గౌరవనీయులు డి.ఎస్.పి సబిత గారు వారి తల్లిదండ్రులు నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తులు, ఏడుగురు అక్క చెల్లెలు అందులో సబిత గారు చదువుపై చిన్నప్పటినుండే ఆసక్తిగా ఉండేవారు, చిన్న వయసులోనే పెళ్లి చేసుకుని, అత్త, మామ, భర్త వారి యొక్క కుటుంబ సహకారంతో, చదువునే ఆయుధంగా మలుచుకొని, ఈరోజు ఈ



స్థాయికి రావడం అనేది మారుమూల తండాల్లో విద్యార్థులకు, యువతులకు నేటి తరానికి ఒక ఆదర్శప్రాయంగా నిలిచారు, కాబట్టి ఆడపిల్ల పుడితే దండగ అన్న నేడు అదే ఆడపిల్ల కుటుంబానికి భరోసాగా సమాజానికి ఒక నిదర్శనంగా నిలిచారు, పేదరికంలో పుట్టడం తప్పు కాదు పేదరికంలో మరణించడం తప్పు కాబట్టి నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తులు విద్యను నమ్ముకుని ఒక లక్ష్యాన్ని ఎంచుకొని లక్ష సాధన దిశగా నిత్యం సాధన చేస్తే తప్పకుండా భవిష్యత్తులో ప్రతి బిడ్డ యొక్క భవిష్యత్తు అత్యంత స్థానంలో ఉంటుందని తెలియజేశారు,

# సూర్యాపేటకు మంజూరైన బుల్లెట్ రైలును అడ్డుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు ఆగ్రహం
- బుల్లెట్ ట్రైన్ సాధన సమితి దీక్షల 61వ రోజుకు సంఘీభావం తెలిపిన బీజేపీ శ్రేణులు

**సూర్యాపేట, అక్టోబర్ 13, వుదయం ప్రతినిధి**

కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే సూర్యాపేటకు బుల్లెట్ రైలు స్టేషన్‌ను మంజూరు చేసినప్పటికీ, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా అలైన్‌మెంట్‌ను మారుస్తూ ప్రతిపాదనలు పంపడాన్ని నిరసిస్తూ బుల్లెట్ ట్రైన్ సాధన సమితి ఆధ్వర్యంలో 61 రోజులుగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షలకు బీజేపీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. చివేముల మండల అధ్యక్షుడు మాధవరపు అనిల్ రావు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి దీక్షలో కూర్చున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు గారు దీక్షలో ఉన్న నాయకులకు పూలమాలలు వేసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శంషాబాద్ టు చెన్నై బుల్లెట్ ట్రైన్ సూర్యాపేట స్టేషన్ మీదుగా అలైన్‌మెంట్ కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ తీర్మానం చేస్తే, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ద్వారా సూర్యాపేట స్టేషన్ అలైన్‌మెంట్ మీదుగా డీపీఆర్ అప్రూవల్ తీసుకువచ్చే బాధ్యతను నేను తీసుకుంటా."

కేంద్రం మొదటి రెండు అలైన్‌మెంట్ల ప్రకారం NH-65 కి సమాంతరంగా చౌటుప్పల్, సూర్యాపేట, కోదాడ మీదుగా మార్గం ప్రతిపాదించి సూర్యాపేటకు స్టేషన్ మంజూరు చేస్తే, రాష్ట్ర ప్రభుత్వం రియల్ ఎస్టేట్ లాభాల కోసం ఫ్యూచర్ సిటీ, హాలియా, వాడపల్లి మీదుగా మూడవ ప్రతిపాదనను పంపి సూర్యాపేట ప్రజల నోటికాడి కూడు లాగేస్తోంది. కేంద్రం రైలు ఇస్తానంటే రాష్ట్రం అడ్డుపడుతోంది."

కాంగ్రెస్ పార్టీ తన వైఖరి వెంటనే స్పష్టం చేయాలి. లేకపోతే వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పడానికి ఓటర్లు సిద్ధంగా ఉన్నారు." దీక్షలో పాల్గొన్న నాయకులు: జిల్లా కౌన్సిల్ సభ్యులు పేర్వాల లక్ష్మణరావు, జిల్లా నాయకులు జంపాల వెంకన్న, రమావత్ మాంగ్తా నాయక్, వీరన్న నాయక్, దారావత్ బాలు నాయక్, షేక్ జానీ బాషా, బిట్టు నాగరాజు, మండల నాయకులు దొంగరి అంజయ్య, పగిళ్ల జానయ్య, పెద్దపోలు వీరేందర్ తదితరులు. సంఘీభావం తెలిపిన నాయకులు: మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లమల్ల నరసింహ, మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎండి అబిద్, అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, సలిగంటి వీరేందర్, మండల అధ్యక్షులు అలుగుబెల్లి సైదిరెడ్డి, తాళ్లపల్లి మధు, పగిళ్ల సుసింధర్ రెడ్డి, పోలగాని ధనుంజయ గౌడ్ తదితర ముఖ్య నాయకులు.



## గ్రామం క్షేమం కోసమే అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ

**రేపాల ఉపసర్పంచ్ తుమ్మ సతీష్**

**మునగాల, అక్టోబర్ 13 (వుదయం):**

గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, రైతులకు పాడిపంటలు సమృద్ధిగా పండాలని, గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ రేపాల ఉపసర్పంచ్ తుమ్మ సతీష్ దుర్గాదేవి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మునగాల మండలం రేపాల గ్రామంలోని ఒకటో వార్డులో విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుని పట్టు వస్త్రాలు, పూలు, పండ్లు, గాజులు, పసుపు, కుంకుమ సమర్పించారు. ఈ సందర్భంగా తుమ్మ సతీష్ మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని,



రైతులకు పంటలు బాగా పండాలని, గ్రామ అభివృద్ధి నిరంతరం కొనసాగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన కుమారుడు హరి వరుణ్ తేజ, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించేందుకు కృషి

**పది మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ**

**మునగాల, అక్టోబర్ 13 (వుదయం):**

మునగాల మండల పరిధిలోని నరసింహపురం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇటీవల ఇళ్లు మంజూరైన పది మంది లబ్ధిదారులకు గ్రామ సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసర్ల కోటయ్య ఆధ్వర్యంలో ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు ఇళ్లు మంజూరు కావడం సంతోషకరమన్నారు. స్థానిక ఎమ్మెల్యే నల్లమాద పద్మావతి రెడ్డి, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో మిగిలిపోయిన అర్హులైన లబ్ధిదారులకు కూడా రాబోయే రోజుల్లో ఇళ్లు మంజూరయ్యేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ నరేష్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఉపసర్పంచ్ రెడ్డబోయిన ప్రశాంత్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండు లక్ష్మీనారాయణ, వార్డు సభ్యులు షేక్ అజీజ్ మియా, కేసకాని కామేశ్వరి, వెంకన్న, రేవూరి కళ్యాణి బాబు, మీసాల బిక్షం, కాంగ్రెస్ నాయకులు ఓరుగంటి రవి, కాలె సామేలు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు.





## మల్టీ పర్పస్ వర్కర్లకు సత్కారం

**చండూరు, అక్టోబర్ 13(వుదయం):**

చండూరు మండలం ఉడుతలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మల్టీ పర్పస్ వర్కర్లను పాలకవర్గం ఘనంగా సత్కరించింది. సర్పంచ్ కావలి శివాని సురేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వర్కర్ల సేవలను ప్రశంసిస్తూ వారికి ప్రత్యేక డ్రెస్ కోడ్‌తో పాటు బూట్లు, గ్లౌజులు, సబ్బులు, సర్ఫ్, నూనె డబ్బాలతో కూడిన సేఫ్టీ కిట్లను అందజేశారు. గ్రామాన్ని శుభ్రంగా ఉంచడంలో వర్కర్ల పాత్ర కీలకమని, ఎవరూ వారిని అవమానించేలా మాట్లాడకూడదని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, ఉపసర్పంచ్ రజిత రమేష్, కాంగ్రెస్ నాయకులు గంట తులసయ్య, వార్డు సభ్యులు అమృత యాదయ్య, యాదమ్మ పాల్గొన్నారు.

## జిల్లా అధ్యక్షుడిగా మరో అవకాశం కల్పించండి

- నాయకుల ఆశీర్వాదంతో సంఘం అభివృద్ధికి కృషి చేస్తా
- చింత ఎల్లయ్య విజ్ఞప్తి

**నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి అక్టోబర్ 13**

నల్లగొండ పట్టణంలో ఎంఈఎఫ్ జాతీయ, రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయి నాయకులు, మాజీ, ప్రస్తుత పదవుల్లో ఉన్న నాయకులు, వివిధ శాఖలకు చెందిన నాయకులు, నాయకురాళ్లు తనకు మరోసారి అవకాశం కల్పించాలని ఎంఈఎఫ్ నల్లగొండ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు చింత ఎల్లయ్య విజ్ఞప్తి చేశారు. ఈ నెల 14న బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నల్లగొండ పట్టణంలోని గాంధీ నగర్–రామగిరి ప్రాంతంలో ఆల్ఫా జూనియర్ కళాశాల బాయ్స్ హాస్టల్ సమీపంలోని యాదవ సంఘం భవనంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు. తాను 17 సంవత్సరాల పాటు ఆల్ఫా పబ్లిక్ స్కూల్ విద్యాసంస్థలో పనిచేశానని, లంకపల్లి నాగేశ్, మామిడి సైదులు జిల్లా అధ్యక్షులుగా ఉన్న సమయంలో జిల్లా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించానని చింత ఎల్లయ్య గుర్తుచేశారు. విద్యుత్ శాఖలో కార్మికుల సమస్యల



పరిష్కారం కోసం గత 14 సంవత్సరాలుగా వివిధ హోదాల్లో పనిచేస్తూ, అవసరమైన సందర్భాల్లో పదవులను సైతం త్యాగం చేసి ఉద్యమాల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ఎంఆర్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో జరిగిన పోరాటాల ఫలితంగా ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని, దీనివల్ల మాదిగ సామాజికవర్గానికి ఎంతో ప్రయోజనం చేకూరిందని పేర్కొన్నారు. భవిష్యత్తులో పిల్లలకు కూడా వర్గీకరణ ద్వారా ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. జాంబవ భవనం నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. సంఘం నాయకులందరి ఆశీర్వాదం, సహకారంతో జిల్లా అధ్యక్షుడిగా మరోసారి ఎన్నికైతే అందరికీ అందుబాటులో ఉంటూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని చింత ఎల్లయ్య తెలిపారు. ఈ నెల 14న జరిగే కార్యక్రమానికి నాయకులందరూ హాజరై తనకు మద్దతు తెలిపి, జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యేందుకు సహకరించాలని కోరారు.

## లక్ష్మి కాలనీ గ్రావెల్ దందాపై శ్వేతపత్రం విడుదల చేయాలి!

- సీజ్ చేసిన జేసీబీలు, టిప్పర్ల సంగతేంటి?
- అక్రమ తవ్వకాల వెనుక ఉన్నదెవరు?

**చర్ల, అక్టోబర్ 13: (వుదయం ప్రతినిధి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని లక్ష్మి కాలనీ గ్రామ పంచాయతీ పరిధిలో వెలుగుచూసిన అక్రమ గ్రావెల్ తవ్వకాల వ్యవహారంపై ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఇరప రాజు దొర తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ సహజ వనరులను అక్రమంగా తవ్వి తరలించినట్లు ఆరోపణలు వెలువడిన నేపథ్యంలో, ఈ వ్యవహారంపై అధికారులు పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలని ఆయన డిమాండ్ చేశారు. సీజ్ చేసిన జేసీబీలు, టిప్పర్ లారీల వివరాలను వెల్లడించకుండా అధికారులు మౌనం వహించడం అనేక అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు.

**సీజ్ చేసిన వాహనాలపై చర్యలేవి?**

లక్ష్మి కాలనీలో అక్రమ గ్రావెల్ తవ్వకాలకు ఉపయోగించినట్లు గుర్తించి సీజ్ చేసిన జేసీబీలు, టిప్పర్ లారీలకు సంబంధించిన పూర్తి వివరాలను చర్ల మండల తహసీల్దార్ తక్షణమే వెల్లడించాలని రాజు దొర డిమాండ్ చేశారు. ఎన్ని వాహనాలను సీజ్ చేశారు? వాటి యజమానులు ఎవరు? అక్రమ తవ్వకాల ద్వారా ఎంతమేర ప్రభుత్వ సంపద తరలిపోయింది? బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే ప్రశ్నలకు రెవెన్యూ అధికారులు సమాధానం చెప్పాలని కోరారు. వాహనాలను సీజ్ చేసినట్లు ప్రకటించడం మాత్రమే సరిపోదని, తదుపరి చర్యలు ఏమిటో ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు.

**అక్రమ తవ్వకాల వెనుక ఉన్నదెవరు?**

చర్ల మండలంలో అక్రమ గ్రావెల్ తవ్వకాలపై సమగ్ర విచారణ జరిపి, ఈ వ్యవహారంలో



ఎవరెవరి పాత్ర ఉందో నిగ్గు తేల్చాలని రాజు దొర డిమాండ్ చేశారు. అక్రమ తవ్వకాలకు అనుమతులు ఇచ్చినా, సహకరించినా లేదా విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా సంబంధిత వ్యక్తులు, అధికారులు ఎవరైనా సరే విచారణ జరిపి, తప్పు నిర్ధారణ అయితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఆదాయానికి జరిగిన నష్టాన్ని అంచనా వేసి, నిబంధనల ప్రకారం జరిమానాలు విధించాలని కోరారు.

**రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిజాలు వెల్లడించాలి!**

ప్రజలకు చెందిన సహజ వనరులు అక్రమ తవ్వకాలకు గురవుతున్నాయనే ఆరోపణలు వచ్చినప్పుడు అధికారులు బాధ్యతాయుతంగా స్పందించాలని రాజు దొర అన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని, లక్ష్మి కాలనీ గ్రావెల్ తవ్వకాలపై తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ తవ్వకాలు పునరావృతం కాకుండా పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ సంపదను కాపాడటంలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని హితవు పలికారు. లేనిపక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు

లక్ష్మి కాలనీలో జరిగిన అక్రమ గ్రావెల్ తవ్వకాలపై తహసీల్దార్ వెంటనే స్పందించి పూర్తి వివరాలను వెల్లడించాలని రాజు దొర స్పష్టం చేశారు. అధికారులు స్పందించని పక్షంలో ఈ వ్యవహారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, చట్టపరమైన మార్గాల్లో పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు.

## ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ బోర్డు డైరెక్టర్ బరిలో కర్నాటి వజ్రమ్మ!

**గట్టుప్పల్, అక్టోబర్ 13( వుదయం):**

దేశ అత్యున్నత చేనేత వేదికపై తెలంగాణ సత్తా చాటేందుకు మరో అడుగు ముందుకు పడింది. అఖిల భారత (ఆల్ ఇండియా) హ్యాండ్లూమ్ సొసైటీ బోర్డు డైరెక్టర్ ఎన్నికల్లో గట్టుప్పల గ్రామానికి చెందిన ప్రముఖ తెలంగాణ హ్యాండ్లూమ్ ప్రతినిధి కర్నాటి వజ్రమ్మ నామినేషన్ దాఖలు చేశారు. ఇటీవల జరిగిన హ్యాండ్లూమ్ బోర్డ్ రాష్ట్ర ప్రతినిధుల ఎన్నికల్లో ఘన విజయం సాధించి ప్రస్తుతం క్రియాశీలక బాధ్యతలు నిర్వహిస్తున్న వజ్రమ్మ.. ఇప్పుడు నేరుగా జాతీయ స్థాయి ఎన్నికల బరిలో నిలిచారు. ఈ నెల 23న దేశ రాజధాని ఢిల్లీలో జరగనున్న ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ బోర్డు డైరెక్టర్ ఎన్నికల్లో ఆమె తన నామినేషన్‌ను సమర్పించారు. ఈ సందర్భంగా కర్నాటి వజ్రమ్మ మాట్లాడుతూ.. చేనేత రంగాన్ని సర్వతోముఖాభివృద్ధి చేయడం, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే తన ప్రధాన ధ్యేయమని



స్పష్టం చేశారు. చేనేత కుటుంబాల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తామని, జాతీయ స్థాయిలో తెలంగాణ చేనేత వాణిని గట్టిగా వినిపిస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ నుంచి జాతీయ స్థాయికి చేనేత ప్రతినిధిగా ఆమె నామినేషన్ వేయడం పట్ల గట్టుప్పల గ్రామస్తులతో పాటు రాష్ట్రంలోని చేనేత కార్మికులు, సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఢిల్లీలో జరగనున్న ఎన్నికల్లో ఆమె అఖండ విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నారు.



## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేద కుటుంబాలకు అండ

**సామినేని సుజాత, మున్సిపల్ చైర్పర్సన్**

**మధిర, అక్టోబర్ 13, వుదయం, ప్రతినిధి:**

పేద కుటుంబాల సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతని,అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని మధిర మున్సిపల్ చైర్పర్సన్ సామినేని సుజాత అన్నారు. మంగళవారం మధిర తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాళ్లబండి రాంబాబుతో కలిసి కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ పథకాల కింద 30 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.1,00,116 చొప్పున మొత్తం రూ.30 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక ఇబ్బందులు ఎదురుకాకుండా,తల్లిదండ్రులు అప్పులపాలు కాకూడదనే ఉద్దేశంతో అమలు చేస్తున్న ఈ పథకాలు పేద కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తున్నాయని తెలిపారు. మధిర ఎమ్మెల్యే, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సహకారంతో పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పారుపల్లి విజయ్ కుమార్, తలుపుల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు రమణ నాయక్, బెజ్జం రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్, కాంగ్రెస్ నాయకులు దోర్నాల వెంకట రవి, ఎర్రగుంట రమేష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష



- తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి
- డీసీసీ అధ్యక్షులు పున్న కైలాస్ నేత

**నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి అక్టోబర్ 13**

న్యూఢిల్లీ నల్గొండ, ఖమ్మం, వరంగల్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాచరణపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తన నివాసంలో మంగళవారం కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ చామల కిరణ్‌తో పాటు ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య బత్తుల లక్ష్మారెడ్డి బాలు నాయక్ మందుల సామి హాజరయ్యారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ఎన్నికల కార్యాచరణపై నాయకులు చర్చించారు.

## కల్లూరు మున్సిపాలిటీలో వైభవంగా బతుకమ్మ సంబరాలు



**కల్లూరు,అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి)**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చిన మహిళలు, సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. బతుకమ్మ పాటలు పాడుతూ, సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. దీంతో వేడుకల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. మన సంస్కృతిని భావితరాలకు అందించడంలో ఇటువంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. మహిళలు ఐకమత్యంతో ఆనందోత్సాహాల మధ్య వేడుకలు జరుపుకోవడం సంతోషకరమన్నారు. మున్సిపల్ కమిషనర్ సాయికృష్ణారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకుంటూ పండుగలను సమిష్టిగా నిర్వహించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొంటూ, వేడుకల్లో పాల్గొన్న మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు జిల్లెల్ల స్వాతి ప్రభాకర్ రెడ్డి, బీరెల్లి మాధవ్, యాస నాగమణి శ్రీకాంత్, ఉబ్బన రాంబాబు, రాధా ఖమ్మంపాటి వీరస్వామి, మాజీ ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్, మున్సిపల్ మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరరావు, వార్డు అధికారులు సరోజిని, తనుజ, సుధారాణి, మున్సిపల్, మెప్మా సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యం



**ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాల పంపిణీ**

**మునగాల, అక్టోబర్ 13 (వుదయం):**

మునగాల మండల పరిధిలోని కృష్ణనగర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు. సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని, పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేయడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణనగర్ గ్రామ సర్పంచ్ లలిత రామిరెడ్డి, ఉప సర్పంచ్ లాల్ సింగ్ నాయక్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు భద్రజీ గౌడ్, బూత్ ఇన్‌చార్జి లక్ష్మారెడ్డి పాల్గొని లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, గ్రామ కార్యదర్శి, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నపూర్ణాదేవి అలంకారంలో వాసవి మాత

**మధిర, అక్టోబర్, 13, వుదయం, ప్రతినిధి:**

మధిర శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు శ్రీ శ్రీనివాసులు శేషాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించగా, అర్చకులు శర్మ ఆధ్వర్యంలో హోమ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అన్నపూర్ణాదేవి అలంకారంలో కొలువుదీరిన వాసవి మాతను దర్శించుకునేందుకు మహిళా భక్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారి నామస్మరణలు, భక్తుల సందడితో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆర్య వైశ్యులు, మహిళా భక్తులు పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందారు.



## పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం

**అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయాలి**

**సర్పంచ్ కాంపాటి వెంకట్**

**మునగాల, అక్టోబర్ 13 (వుదయం):**

మునగాల మండలంలోని నారాయణగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సంబంధించిన పత్రాలను గ్రామ సర్పంచ్ కాంపాటి వెంకట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, గ్రామ అభివృద్ధికి ప్రజలంతా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ నరేష్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.



## చిన్నారి పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు అన్నప్రసాద వితరణ



**మునగాల, అక్టోబర్ 13 (వుదయం):**

పుట్టినరోజు వేడుకలను అనాథ వృద్ధుల మధ్య జరుపుకుంటూ ఆలేటి గురు ప్రసాద్–ప్రమీల దంపతులు సేవాభావాన్ని చాటుకున్నారు. మునగాల మండలం తాడువాయి గ్రామానికి చెందిన ఈ దంపతుల కుమారుడు కృషాల్ శివన్ మొదటి పుట్టినరోజు సందర్భంగా మండలంలోని ముకుందాపురం సమీపంలో ఉన్న ఇందిరా అనాథ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 40 మంది వృద్ధులకు సీట్లు, వివిధ రకాల వంటకాలతో అన్నప్రసాదాన్ని అందించారు. చిన్నారి పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేయడం పట్ల వృద్ధులు సంతోషం వ్యక్తం చేస్తూ చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ గంధం సైదులు, జర్నలిస్ట్ ఆలేటి మహేష్, వృద్ధాశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటా ఇంకుడు గుంత.. ప్రతి పొలంలో నీటి కుంట

- మహిళలకు కుంకుమ తిలకాలతో జలసిరిపై అవగాహన
- సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ

**మునగాల, అక్టోబర్ 13 (వుదయం):**

భూగర్భ జలాలను సంరక్షించి, భవిష్యత్తులో నీటి కొరతను నివారించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన జలసిరి కార్యక్రమంపై మునగాల మండలం నరసింహపురం గ్రామంలో వినూత్నంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలు, మహిళలకు కుంకుమ తిలకాలు, గంధం పెట్టి గ్రామంలోని ప్రతి వీధిలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. గ్రామస్థులతో కలిసి బ్యానర్లు ప్రదర్శిస్తూ జలసిరి కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రజలు, రైతులు నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత నిర్మించుకోవాలని, ప్రతి పొలంలో పంట కుంటలు, గ్రామాల్లో ఊట కుంటలు ఏర్పాటు చేసుకోవాలని, బోరుబావుల వద్ద భూగర్భ జలాల పెంపునకు రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టాలని కోరారు. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఏడాదికి 125 రోజుల ఉపాధి కల్పించే లక్ష్యాన్ని సాధించేందుకు సహకరించాలని కోరారు. మండల ఎంపీఓ నరేష్ మాట్లాడుతూ జలసిరి కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, నరసింహపురం గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో చేపట్టిన వినూత్న అవగాహన కార్యక్రమం ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. గ్రామస్థులందరూ సమష్టిగా కృషి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వి.బి.–జీ రామ్ జీ పథకం టెక్నికల్



అసిస్టెంట్ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత నిర్మించుకోవడం ద్వారా భూగర్భ జలాల పెంపునకు సహకరించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రెడ్డబోయిన ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు షేక్ అజీజ్ మియా, కేసగాని కామేశ్వరి, వెంకన్న, రేవూరి కళ్యాణి బాబు, మీసాల బిక్షం, గ్రామ పెద్దలు బొమ్మ చిన్న వెంకన్న, కారంగుల సైదులు, వీరబోయిన వినోద్, కిన్నెర హరీష్, మనోజ్, రేవూరి బాబు, మీసాల రామ్మూర్తి, నారయ్య, వెంకటేశ్వర్లు, సమీనా, బొమ్మ స్వాతి, గ్రామపంచాయతీ సిబ్బంది, మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ వేడుకల ఫొటోలు వీడియోలతో విస్తృత ప్రచారం కల్పించాలి

- పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ వాణీ ప్రసాద్
- సూపర్ ఎల్‌నినో ప్రభావాలపై బతుకమ్మ పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలి
- పర్యాటక అభివృద్ధి పనులను స్థానిక ఇంజినీరింగ్ శాఖలతో పూర్తి చేయాలి




జగిత్యాల అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి)

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని పర్యాటక సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ వాణీ ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో బతుకమ్మ వేడుకల నిర్వహణతో పాటు పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుల అమలు నిధుల సమీకరణ ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ వాణీ ప్రసాద్ మాట్లాడుతూ బతుకమ్మ వేడుకలు గ్రామాలు పట్టణాల్లో ప్రజల భాగస్వామ్యంతో పండుగ వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సూచించారు మహిళలు యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని తెలిపారు వేడుకలు జరిగే ప్రదేశాల్లో పారిశుధ్యం తాగునీరు విద్యుత్ దీపాలు రవాణా పార్కింగ్ భద్రత వంటి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు.బతుకమ్మ వేడుకలకు సంబంధించిన ఫొటోలు వీడియోలను విస్తృతంగా సేకరించి ప్రచారం చేయాలని కలెక్టర్లకు సూచించారు బతుకమ్మ పండుగ విశిష్టత తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు ప్రజలకు చేరువయ్యే విధంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.

**బతుకమ్మ పాటల ద్వారా సూపర్ ఎల్‌నినోపై అవగాహన కల్పించాలి**

ప్రస్తుత సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షపాతం నీటి లభ్యత వ్యవసాయం పర్యావరణంపై ప్రభావాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎ వాణీ ప్రసాద్ సూచించారు బతుకమ్మ పాటల పోటీలను నిర్వహించి ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నీటి సంరక్షణ పర్యావరణ పరిరక్షణ నీటిని పొదుపుగా వినియోగించడం వంటి అంశాలు పాటల్లో ప్రతిబింబించేలా కలెక్టర్లు చొరవ తీసుకోవాలన్నారు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణమైన సందేశాలతో పాటలు రూపొందించేలా ప్రజలను మహిళా సంఘాలను యువతను ప్రోత్సహించాలని తెలిపారు బతుకమ్మ వేడుకలను సాంస్కృతిక కార్యక్రమాలకే పరిమితం చేయకుండా ప్రజలకు అవసరమైన అవగాహన కల్పించే వేదికగా కూడా వినియోగించుకోవాలని సూచించారు

**పర్యాటక అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి**

రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 56 పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులను జిల్లాలకు బదిలీ చేసినట్లు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తెలిపారు ఇందులో నాగర్‌కర్నూల్ జిల్లాకు 20 ఖమ్మం జిల్లాకు 12 జగిత్యాల జిల్లాకు 2 ప్రాజెక్టులను అప్పగించినట్లు పేర్కొన్నారు ఈ ప్రాజెక్టులను సంబంధిత స్థానిక ఇంజినీరింగ్ శాఖల సమన్వయంతో చేపట్టి నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు జిల్లాలకు బదిలీ చేసిన పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుల వివరాలను పరిశీలించి వాటి పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు స్థానిక ఇంజినీరింగ్ శాఖలకు పనుల బాధ్యతలు అప్పగించి పనుల అమలు నాణ్యత పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు పనులు పూర్తయిన వెంటనే సంబంధిత బిల్లులను పర్యాటక కార్పొరేషన్‌కు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**రెండు వారాల్లోగా డీపీఆర్ తయారీ బాధ్యతలు అప్పగించాలి**

పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డీపీఆర్) సిద్ధం చేసేందుకు తగిన కార్యాచరణ రూపొందించాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సూచించారు అవసరమైన చోట కన్సల్టెన్సీ సహకారం కూడా అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు ప్రతి జిల్లాలో సంబంధిత ప్రాజెక్టుల డీపీఆర్ తయారీ బాధ్యతలను రెండు వారాల్లోగా ఇంజినీరింగ్ శాఖలకు లేదా తగిన సంస్థలకు అప్పగించాలని ఆదేశించారు ప్రాజెక్టు పరిధి భూమి లభ్యత నిర్మాణ పనులు అవసరమైన మౌలిక సదుపాయాలు అంచనా వ్యయం నిధుల సమీకరణ అమలు గడువు వంటి అంశాలను డీపీఆర్‌లో స్పష్టంగా పొందుపరచాలని సూచించారు.

**హరిత హోటళ్ల పూర్తికి పీపీపీ విధానంలో చర్యలు**

కొన్ని జిల్లాల్లో హరిత హోటళ్ల నిర్మాణ పనులు పాక్షికంగా పూర్తయిన నేపథ్యంలో మిగిలిన పనులను పూర్తి చేసి వాటిని నిర్వహణలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ఎ వాణీ ప్రసాద్ తెలిపారు.ప్రైవేట్ పెట్టుబడిదారుల సహకారంతో నిర్మాణ పనులను పూర్తి చేసి నిర్దిష్ట కాలం పాటు నిర్వహణ బాధ్యతలను వారికి అప్పగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు జిల్లాలలో ఇటువంటి ప్రాజెక్టులకు ఆసక్తి చూపే ప్రైవేట్ పెట్టుబడిదారులు ఉంటే జిల్లా స్థాయిలో వారిని గుర్తించి ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు ఈ విషయంలో ప్రజాప్రతినిధుల సహకారం కూడా తీసుకోవాలని సూచించారు.

**నిధుల వనరులను పరిశీలించి పర్యాటక ప్రణాళిక రూపొందించాలి**

ప్రతి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను గుర్తించి సమగ్ర ప్రణాళికతో పాటు ఆకర్షణీయమైన ప్రజెంటేషన్ సిద్ధం చేయాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సూచించారు జిల్లాలోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలు చారిత్రక ప్రదేశాలు ఆధ్యాత్మిక క్షేత్రాలు ప్రకృతి అందాలు వారసత్వ ప్రదేశాలను గుర్తించి వాటి అభివృద్ధికి అవసరమైన భూమి మౌలిక సదుపాయాలు అంచనా వ్యయం అమలు విధానం పర్యాటకుల సౌకర్యాలను ప్రణాళికలో పొందుపరచాలన్నారు .పర్యాటక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ నిధులు కేంద్ర ప్రభుత్వ పథకాలు స్వచ్ఛంద సంస్థల సహకారం ప్రైవేట్ పెట్టుబడులు వంటి అన్ని అవకాశాలను పరిశీలించాలని తెలిపారు ముఖ్యంగా స్వదేశ్ దర్శన్ పర్యాటక అభివృద్ధి కార్యక్రమం కింద జిల్లాకు అనువైన ప్రాజెక్టులను గుర్తించి నిధులు సమకూర్చుకునేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు పర్యాటక ప్రాంతాల్లో రహదారులు తాగునీరు విద్యుత్ పారిశుధ్యం మరుగుదొడ్లు పార్కింగ్ వసతి సమాచార బోర్డులు భద్రత వంటి సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు స్థానిక కళలు హస్తకళలు స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు స్థానిక ఆహార సంస్కృతిని పర్యాటకంతో అనుసంధానం చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు పెంపొందించాలన్నారు

**ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో భద్రతా సిబ్బందిని నియమించాలి**

రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎ వాణీ ప్రసాద్ సూచించారు ఈ మేరకు జిల్లాలకు పంపిన పర్యాటక ప్రాంతాల జాబితాను పరిశీలించి అవసరమైన ప్రాంతాల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో భద్రతా సిబ్బందిని నియమించే చర్యలు జిల్లా స్థాయిలో చేపట్టాలని ఆదేశించారు పర్యాటక ప్రాంతాలకు వచ్చే సందర్శకులకు సురక్షిత వాతావరణం కల్పించడంతో పాటు సంబంధిత శాఖల సమన్వయంతో పర్యాటక సౌకర్యాలను మెరుగుపరచాలని తెలిపారు వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో బతుకమ్మ పండుగకు అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని ఆదేశాలు జారీ చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రెవెన్యూ డివిజన్ అధికారులు జిల్లా అధికారులు మున్సిపల్ కమిషనర్లు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్‌నినో సవాళ్లను అధిగమించేలా ఆయిల్‌పామ్ యాజమాన్యం

**ముత్తారంలో రైతులకు అవగాహన కార్యక్రమం**

ముత్తారం అక్టోబర్ 13(వుందాయం ప్రతినిధి):



ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఆయిల్‌పామ్ తోటల్లో నీటి,పోషక యాజమాన్యంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఉద్యానవన,పట్టు పరిశ్రమ అధికారి గడ్డం శ్యాంప్రసాద్ సూచించారు.మంగళవారం ముత్తారం గ్రామంలో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా శ్యాంప్రసాద్ మాట్లాడుతూ.. సమతుల్య పోషకాల వినియోగం, సమర్థవంతమైన నీటి యాజమాన్యంతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.స్ప్రింక్లర్లు,షెడర్లు, మినీ ట్రాక్టర్లు, బిందు సేద్య పరికరాలపై ఉద్యానవన శాఖ అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా కోకో సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చన్నారు.కోరమాండల్ సంస్థ డీజీఎం, జోనల్ మేనేజర్ ఎన్. హరి సంస్థ ఉత్పత్తుల ప్రయోజనాలను వివరించగా, సీనియర్ అగ్రానమిస్ట్ వినోద్ ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుధాటి రవీందర్‌రావు,బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి,లక్కారం సర్పంచ్ ముత్తారం మాజీ ఎంపీపీ అత్తే చంద్రమౌళి,సింగల్ విండో మాజీ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి,ఉద్యానవన అధికారులు జ్యోతి, రాజశేఖర్,సంస్థ ప్రతినిధులు, రైతులు బోడ ప్రకాష్ రెడ్డి, కొండల్ రెడ్డి, రాజమల్లు తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రఘంటాదేవిగా అమ్మవారి దర్శనం

ధర్మపురి,అక్టోబర్13(వుదయం ప్రతినిధి):



ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం అనుబంధ దేవాలయమైన శ్రీరామలింగేశ్వ రస్వామి ఆలయంలో వేదపండితులు పాలేపు.ప్రవీణ్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుండి మహా సంకల్పం, స్వస్తిపుణ్యా హవాచనం,అఖండ దీపస్థాపన, నవగ్రహ,వాస్తు పూజలు ప్రధాన కలశ స్థాపనలు జరిగాయి.అనంతరం సప్తశతి పారాయణం,చ తుష్షష్టి పూజ,శ్రీచక్రమునకు కుంకుమార్చన,చండీ,దేవీ భాగవత పారాయణాలు,కన్యా,సువాసిని పూజలు నిర్వహించారు. అమ్మవారు చంద్రఘంటా రూ పంలో గులాబీ రంగు చీరలో, మల్లెపువ్వులు,బిల్వపత్రదండల తో భక్తులకు దివ్యదర్శనమిచ్చా రు. సాయంత్రం శ్రీ యోగ, ఉగ్ర నరసింహస్వామి వారి ఉత్సవ మూర్తులను ఐరావత వాహనం పై పుర వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో సూపరిండెం ట్ అల్వాల్.శ్రీనివాస్ వేదపండి తులు,ఆలయ అర్చకులు,సిబ్బంది,భక్తులు పాల్గొన్నారు.

## చెరువులో మునిగి వ్యక్తి మృతి

**మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు**

ముత్తారం అక్టోబర్ 13(వుందయం ప్రతినిధి):



ముత్తారం (మంథని) పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన ఉప్పుల సమ్మయ్య (60) చెరువులో మునిగి మృతి చెందారు.పని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. చివరకు ఆయన చెరువులో మృతి చెందినట్లు తెలిసింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన ఉప్పుల సమ్మయ్య ఈ నెల 12న ఉదయం 9 గంటల సమయంలో పని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లారు.అయితే ఎంతసేపటికీ తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆయన ఆచూకీ కోసం వెతికారు.అయినప్పటికీ సమాచారం లభించకపోవడంతో ఆయన కుమార్తె చింతల రమ్య ముత్తారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.అనంతరం సమ్మయ్య చెరువులో మునిగి మృతి చెందినట్లు గుర్తించారు.ఈ ఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది.ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## బతుకమ్మ వేళ.. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి!

- ప్రతి వార్డులో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్
- మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

వేములవాడ, అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి) :



బతుకమ్మ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు తెలిపారు. పలు వార్డుల్లో నిర్వహిస్తున్న స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ పనులను ఆయన పరిశీలించారు. పండుగ సమయంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుధ్య పనులను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రోడ్లు, వీధుల్లో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, ప్రజారోగ్యానికి ప్రాధాన్యమిస్తూ పారిశుధ్య నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. బతుకమ్మ పండుగను ప్రజలందరూ పరిశుభ్రమైన వాతావరణంలో ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు కూడా మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు. చెత్తను రోడ్లపై వేయకుండా మున్సిపల్ స్వచ్ఛ ఆటోలకు అందించాలని, నిర్దేశించిన ప్రదేశాల్లోనే చెత్త వేయాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతోనే పట్టణాన్ని మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రథమ్ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

పెద్దపల్లి, అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి)



విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీస్తూ, మహిళల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల ఆసక్తిని పెంపొందించే లక్ష్యంతో పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంట గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాలల సంబరాలు, బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంస్థ సభ్యురాలు ఈదునూరి పద్మ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిన్నారులు ఆటపాటలతో సందడి చేయగా, మహిళలు బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. దసరా సెలవులను పురస్కరించుకుని ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. చిన్నారులు తమ ప్రతిభను చాటుకుంటూ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు గ్రామ ప్రజాప్రతినిధులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజులత చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ గోగు రాజయ్య, ఉపసర్పంచ్ తిరుపతి, ప్రధానోపాధ్యాయురాలు మంజులత మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకత, క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. పిల్లలతో పాటు తల్లులను భాగస్వాములను చేస్తూ బతుకమ్మ వేడుకలు నిర్వహించడం ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రోత్సహించడం అభినందనీయమని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధి, సామాజిక చైతన్యం కోసం ప్రథమ్ సంస్థ చేస్తున్న కృషిని వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు. చిన్నారుల విద్యార్థినీలు మహిళలు పాల్గొన్నారు



## జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ను కలిసిన ఎమ్మెల్యే సంజయ్

కోరుట్ల అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి)

జగిత్యాల జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ ని కోరుట్ల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కి సంబంధించిన విన్నతులను వివరించారు ఇందులో భాగంగా మెట్పల్లి మండలం చర్ల కొండాపూర్ గ్రామంలోని ఎంపీపీ ఎస్ పాఠశాలలో కిచెన్ షెడ్యూల్ నిర్మాణం అలాగే మెట్పల్లి మండలం పెద్దాపూర్ గ్రామంలోని అంగన్వాడి కేంద్రం ఏర్పాటు కోరుట్ల మండలంలోని సంగెం గ్రామంలోని కల్వర్టు నిర్మాణం చేపట్టాలని కోరుతూ జిల్లా కలెక్టర్ ను కలిసి వివరించినట్లు ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ తెలిపారు.



## దసరా సందర్భంగా క్రికెట్ పోటీలు ప్రారంభం

ముత్తారం అక్టోబర్ 13(వుదయం ప్రతినిధి):

ముత్తారం మండలం పారుపల్లి గ్రామంలో దసరా పండుగ వేడుకలను పురస్కరించుకొని మంగళవారం క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి.చొప్పరి సాయి, ఏడవేన కౌశిక్,పవన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం,స్థానిక సర్పంచ్ చొప్పరి సంపత్ కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పండుగల వేళ క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా యువతలో స్నేహభావం,ఐకమత్యం పెంపొందుతాయని అన్నారు.క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని పేర్కొన్నారు.యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామస్తులు,యువకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



## గజ వాహనం భక్తులకు దర్శనమిచ్చిన వేంకటేశ్వర స్వామి

కోరుట్ల అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి)

కోరుట్ల పట్టణంలో గల అతి పురాతనమైన శ్రీ వేంకటేశ్వర స్వామి దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నేడు మూడవ రోజు గజ వాహనంపై వేంచేసి ఉన్న స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు బిర్నంది నర్సింహాచారి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం స్వామివారు భక్తులను దర్శనమిచ్చేందుకు పట్టణ పురవీధుల గుండా వేంచేయగా మహిళలు మంగళహారతో స్వామివారికి స్వాగతం పలికారు ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఎతిరాజం నర్సయ్య ధర్మకర్తలు నేటి శ్రీనివాస్ కటుకం దివాకర్ కోట గంగాధర్ గోడికె రాములు చిలువేరి విజయకుమార్ చిట్యాల పద్మ ఆలయ ఈవోఏం విక్రమ్ జూనియర్ అసిస్టెంట్ పేడిపల్లి నర్సయ్య, మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు

ముత్తారం అక్టోబర్ 13(వుందయం ప్రతినిధి):



మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం స్వరూప రాణి ఆధ్వర్యంలో మంగళవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ బతుకమ్మల చుట్టూ ఆడిపాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా స్వరూప రాణి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐకమత్యానికి ప్రతీక అని అన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ పండుగలను జరుపుకోవాలని సూచించారు.

## పెండింగ్ కేసుల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలి

**న్యాయమూర్తి వై. జానకి**

ధర్మపురి,అక్టోబర్13(వుదయం ప్రతినిధి):



పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించడంలో పోలీస్ శాఖ అధికారులు కీలక పాత్ర పోషిం చాలని,అందరూ సమన్వయం తో ముందుకు వెళ్లాలని ధర్మపు రి కోర్టు న్యాయమూర్తి వై.జానకి పిలుపునిచ్చారు.స్థానిక కోర్టు సమావేశ మందిరంలో నిర్వహిం చిన సమీక్షా సమావేశంలో ఆమె పోలీసు అధికారులతో పలు కీల క అంశాలపై చర్చించారు. పెం డింగ్ కేసులు,నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలు,కోర్టుకు సాక్షు ల సకాలంలో హాజరయ్యేలా చూడటం వంటి అంశాలపై దిశానిర్దేశం చేశారు.అనంతరం లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ద్వారా ఖైదీలకు అందుతున్న న్యాయ సహాయం, పెండింగ్ కేసుల వివరాలపై లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యుడు జాజాల రమేష్‌తో న్యాయమూర్తి చర్చించారు.ఖైదీలకు చట్టప రంగా అందవలసిన సహాయాన్ని పారదర్శకంగా అందించాల ని సూచించారు.ఈ సమావేశం లో ఎస్సై లు సదాకర్,ఉదయ్ కుమార్ శ్రీకాంత్, ఎక్సైజ్ ఎస్సై జమీల్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యులు జాజాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురిలో చేయూత పెన్షన్ దరఖాస్తుల పరిశీలన

**పారదర్శకంగా అర్హుల ఎంపిక**

**మున్సిపల్ చైర్మన్ వేముల. నాగలక్ష్మి**

ధర్మపురి,అక్టోబర్13(వు దయం ప్రతినిధి):



తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తు న్న చేయూత పెన్షన్ పథకానికి సంబంధించి దరఖాస్తుల వెరి ఫికేషన్ ప్రక్రియ ధర్మపురి పట్ట ణంలో ముమ్మరంగా సాగుతోం ది.ఇందులో భాగంగా పట్టణం లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదా రుల అర్హతలను పరిశీలించేందు కు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిం చారు.ఈ కార్యక్రమానికి జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి బి.గౌతమ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, లబ్ధిదారుల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వేముల.నాగలక్ష్మి పాల్గొని అధికారులకు తగు సూచనలు చేశారు.ఈ సంద ర్భంగా చైర్మన్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేద కుటుంబా నికి చేయూత పెన్షన్ అందించా లనేదే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సంకల్పం అని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు సక్రమంగా అందేలా అన్ని చర్యలు తీసు కుంటున్నామని తెలిపారు.అధికారులు ఎలాంటి పొర పాట్లకు తావులేకుండా దరఖా స్తుల పరిశీలన ప్రక్రియను అత్యంత పారద ర్శకంగా నిర్వహించాలని ఆమె ఆదేశిం చారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత ఉన్న ఏ ఒక్క లబ్ధిదారుడూ పెన్షన్‌కు దూరం కారా దని,అందరికీ న్యాయం జరిగేలా చూడాలని సంబం ధిత అధికారులను కోరారు.

## పారుపల్లి ఘటనపై ఏసీపీ విచారణ.. ఎస్సీ, ఎస్టీ కేసులో వేగం

ముత్తారం అక్టోబర్ 13(వుందయం ప్రతినిధి):



మండలంలోని పారుపల్లి గ్రామంలో శ్రీపాద,శ్రీకాంత్ అనే యువకుల మధ్య ఇటీవల జరిగిన ఘటనకు సంబంధించి నమోదైన ఎస్సీ,ఎస్టీ కేసులో రామగుండం ఏసీపీ మాడత రమేష్ మంగళవారం విచారణ చేపట్టారు.ఘటనకు సంబంధించిన వివరాలను పరిశీలించి,కేసు దర్యాప్తులో భాగంగా విచారణ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సిఐ బుద్దె స్వామి ముత్తారం ఎస్సై రవికుమార్,రామగిరి ఎస్సై శ్రీనివాస్,పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంథనిలో అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- గోదావరి పుష్కర ఘాట్ వద్ద 10 రోజుల్లోగా కాంక్రీట్ పనులు ప్రారంభించాలి
- నాలుగు రోజుల్లోగా రోడ్డు పనుల డిజైన్లను ఖరారు చేయాలి
- మార్చి 2027 నాటికి సమీకృత డివిజన్ కార్యాలయాల భవన నిర్మాణం పూర్తి చేయాలి
- 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణాన్ని నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలి
- మంథనిలో వివిధ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్

పెద్దపల్లి, (మంథని) అక్టోబర్-13 (వుదయం ప్రతినిధి)



మంథని ప్రాంతంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంథనిలోని గోదావరి పుష్కర ఘాట్ వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులు, మంథని–రామగుండం రహదారిపై హెలిప్యాడ్ నిర్మాణ పనులు, సమీకృత డివిజన్ కార్యాలయాల భవనం, నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి, మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం రామగిరి మండలంలోని పన్నూరు క్రాస్ రోడ్ వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, గోదావరి పుష్కర ఘాట్ వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేసి, మరో 10 రోజుల్లోగా కాంక్రీట్ పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు నిర్మాణానికి సంబంధించిన డిజైన్లను నాలుగు రోజుల్లోగా ఖరారు చేయాలని సూచించారు. అవసరమైన నిర్మాణ సామగ్రిని ముందుగానే సమకూర్చుకోవడంతో పాటు, రోడ్డు నిర్మాణానికి అడ్డుగా ఉన్న చెట్లు, పొదలను తొలగించే పనులను వేగవంతం చేయాలని తెలిపారు. పనుల పురోగతికి ఆటంకంగా ఉన్న సమస్యలను ఆర్డీఓ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని పుష్కర ఘాట్ వద్ద నాలుగు లేన్ల రహదారి విస్తరణ పనులను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సూచించారు. రహదారి మధ్యలో డివైడర్ ఏర్పాటు చేస్తూ, పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని తెలిపారు. పుష్కరాల సమయంలో భక్తులకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రహదారి నిర్మాణ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఆదేశించారు. మంథని–రామగుండం రహదారిపై ఉన్న హెలిప్యాడ్‌ను గోదావరి పుష్కరాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసి, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. రామగిరి మండలంలోని పన్నూరు క్రాస్ రోడ్ వద్ద జరుగుతున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రహదారి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. మంథనిలో నూతనంగా నిర్మిస్తున్న 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవన పనులను పరిశీలించిన కలెక్టర్, నిర్దేశిత గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఆసుపత్రి నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా అవసరమైన సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.

సమీకృత డివిజన్ కార్యాలయాల భవన నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, మార్చి 2027 నాటికి భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనులకు అవసరమైన అదనపు నిధుల ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్దేశిత గడువులోగా భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, ఇప్పటికే అధిక శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించేందుకు వీలుగా భవనాన్ని వీలైనంత త్వరగా సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో ఆర్ అండ్ బి ఈఈ భావ్ సింగ్, ఆర్డీవో సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్,సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 21 నుంచి పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు ప్రారంభం

**జిల్లా ఎస్పీ నికిత పంత్**

**ఆసిఫాబాద్ ( వుదయం ప్రతినిధి )**

కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో పోలీస్ అమరవీరుల ప్రాణత్యాగాలను స్మరించుకుంటూ అక్టోబర్ 21 నుంచి పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్ తెలిపారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న నిర్వహించే పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగా జిల్లా పోలీస్ ఏఆర్ హెడ్ క్వార్టర్స్ పరేడ్ గ్రౌండ్లో అమరవీరుల స్థూపం వద్ద స్మృతి పరేడ్ నిర్వహించి,విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన అమరవీరులకు ఘనంగా నివాళులర్పించనున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. అక్టోబర్ 21 నుంచి సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ ఐక్యత దినోత్సవమైన అక్టోబర్ 31 వరకు పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వివిధ సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించుతామని తెలిపారు

**కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించనున్న కార్యక్రమాలు:**

ఓపెన్ హౌస్ కార్యక్రమాలు: పోలీసుల విధులు, త్యాగాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ప్రజల రక్షణలో పోలీసుల సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుంది.

రక్తదాన శిబిరాలు: పోలీస్ అమరవీరుల సంస్మరణార్థం రక్తదాన శిబిరాలను నిర్వహించడం జరుగుతుంది.

ర్యాలీలు: పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించడం జరుగుతుంది.

కొవ్వొత్తుల ర్యాలీలు: అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించి వారికి నివాళులర్పించడం జరుగుతుంది.

అమరవీరుల కుటుంబాలకు పరామర్శ : పోలీస్ అమరవీరుల కుటుంబాల వద్దకు వెళ్లి,దేశం మరియు ప్రజల రక్షణ కోసం వారు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ నివాళులర్పించడం జరుగుతుంది.

**వ్యాసరచన పోటీలు.. (తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ భాషలలో..)**

కేటగిరి – 1ఇంటర్మీడియట్ వరకు విద్యార్థిని విద్యార్థుల కోసం

1. సైబర్ నేరాల నివారణలో పోలీసుల – పౌరుల పాత్ర

2. డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర....విద్యార్థులు డ్రగ్స్ నుండి ఎలా దూరంగా ఉండగలరు.

కేటగిరి –2 డిగ్రీ మరియు ఆపై చదువుతున్న విద్యార్థుల కోసం

1. సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీసుల పాత్ర.

2. తెలంగాణను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర.

**పోలీస్ అధికారులకు..**

కేటగిరి –1 కానిస్టేబుల్ నుండి ఏఎస్ఐ స్థాయి వరకు..

1. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు పోలీసుల నుండి ఎటువంటి సేవలను ఆశిస్తారు.

2. పోలీసు అధికారుల జీవితాల్లో సోషల్ మీడియా పాత్ర – సోషల్ మీడియా కు బానిస కాకుండా ఉండటం మరియు వ్యక్తిగత మరియు సామాజిక ప్రయోజనాల కోసం దానిని సద్వినియోగం చేసుకోవటం ఎలా.

**కేటగిరి – 2 ఎస్.ఐ మరియు పై స్థాయి అధికారులు..**

1. పౌరుల మన్ననలు పొందటానికి పోలీసులు చేయవలసిన కృషి.

2. నెలస్థాయి పోలీసు వ్యవస్థ బలోపేతం చేయడం ఎలా.

ఈవ్యాసరచన పోటీలను తెలుగు ఇంగ్లీష్ ఉర్దూ భాషలలో నిర్వహించాలని, 500 పదాలకు మించకుండా వ్యాసరచనలో పాల్గొని, ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురికి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అర్హత లభిస్తుందని తెలియజేశారు. షార్ట్ ఫిలిమ్స్, ఫోటోగ్రఫీ పోటీలు: జిల్లా పరిధిలోని విద్యార్థినీ,విద్యార్థులు, యువత,ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లకు షార్ట్ ఫిలిమ్స్, ఫోటోగ్రఫీ పోటీలు నిర్వహించుతామని తెలిపారు పోలీసుల సేవలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పోలీసుల సేవలు, పోలీసుల కీర్తి ప్రతిష్టలను పెంపొందించే ఇతర అంశాలపై ఫోటోలు, వీడియోలను రూపొందించవచ్చు.

షార్ట్ వీడియోలు మూడు నిమిషాలకు మించకుండా రూపొందించాలి. ఉత్తమంగా నిలిచిన ఫోటోలు,వీడియోలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయబడతాయి. ఎంపికైన వారికి రాష్ట్రస్థాయి




పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తారు.పోటీల్లో పాల్గొనదలచిన వారు తమ ఫోటోలు, వీడియోలను అక్టోబర్ 24వ తేదీలోపు జిల్లా పోలీస్ కార్యాలయం లోని పోలీస్ ఐటీ కోర్ కోఆర్డినేటర్ 871–267–0527 కి అందజేయాలి.

ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు బహిరంగ ప్రదేశాల్లో పోలీస్ కళాబృందం ద్వారా అమరవీరుల త్యాగాలను వివరిస్తూ పాటల కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రధాన కూడళ్ల వద్ద పోలీస్ అమరవీరుల బ్యానర్లు ఏర్పాటు చేయడం జరుగుతుంది. దేశ రక్షణ,ప్రజల భద్రత కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు, త్యాగాలను ప్రజలు ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు.

# చర్లలో అక్రమ పశువుల రవాణాకు పోలీస్ అడ్డుకట్ట

**9 ఎద్దులు పట్టివేత గోశాలకు తరలింపు**

**చర్ల, అక్టోబర్ 13: (వుదయం ప్రతినిధి)**

చర్ల మండలంలో అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున రాళ్లగూడెం గ్రామ శివారులో నిర్వహించిన వాహన తనిఖీల్లో 9 ఎద్దులను స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేశారు. చర్ల పోలీసుల వివరాల ప్రకారం.. చర్ల నుంచి భద్రాచలం వైపు వెళ్తున్న అశోక్ లేలాండ్ వాహనం (TG 29 T 6087)ను తనిఖీ చేయగా, అందులో ఎద్దులను ఒకదానిపై ఒకటి కుక్కి క్రూరంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. చర్ల మండలం సీఆర్ కాలనీకి చెందిన చెన్నం నరేంద్ర చర్ల పరిసర ప్రాంతాల నుంచి ఎద్దులను కొనుగోలు చేసి, కబేళాకు తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు . ఈ ఘటనలో ఇద్దరు నిందితులపై తెలంగాణ గోవధ నిషేధ చట్టం సహా సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న 9 ఎద్దులను పాల్వంచలోని అన్నపూర్ణ గోశాలకు తరలించారు. అక్రమంగా పశువులను రవాణా చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.




# జుక్కల్ బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న మాగి సర్పంచ్ గుర్రపు సుమిత్ర శ్రీనివాస్



**ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు**

**నిజాంసాగర్ : అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని జుక్కల్ మండల కేంద్రంలోని గుండూరు రోడ్డులో మంగళవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. నిజాంసాగర్ మండలం మాగి గ్రామ సర్పంచ్ గుర్రపు సుమిత్ర శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, మహిళలు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేంగారం కవిత పండరితో పాటు గ్రామ పెద్దలు, గ్రామ మహిళలు పాల్గొని బతుకమ్మ సంబరాల్లో సందడి చేశారు. బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు ప్రతీక గుర్రపు సుమిత్ర శ్రీనివాస్ ఈ సందర్భంగా మాగి గ్రామ సర్పంచ్ గుర్రపు సుమిత్ర శ్రీనివాస్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ప్రకృతిని ఆరాధించడం మన తెలంగాణ ప్రత్యేకత అని పేర్కొన్నారు. ఇలాంటి పండుగలు మహిళలందరినీ ఒకచోట చేర్చి ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో వేడుకల ప్రాంగణం కళకళలాడింది. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ, నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు సతీమణి అర్చన సైతం మహిళలతో కలిసి బతుకమ్మను పేర్చి, పాటలు పాడుతూ, నృత్యాల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పేలా వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి.

# పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు సిద్ధం చేయాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**

**ఆసిఫాబాద్ ( వుదయం ప్రతినిధి )**

జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పత్తి కొనుగోలు కొరకు ఏర్పాట్లు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావులతో కలిసి మార్కెటింగ్, రవాణా, విద్యుత్, వ్యవసాయ, అగ్నిమాపక, తూనికలు కొలతలు, జిన్నింగ్ మిల్లుల యజమానులు, సి.సి.ఐ. అధికారులతో కొనుగోలు ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2026–27 సీజన్ పత్తి కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లాలో 3 లక్షల 77 వేల ఎకరాలలో పత్తి సాగు జరిగిందని, 26 లక్షల 44 వేల క్వింటాళ్ల పత్తి పంట దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పత్తి మద్దతు ధర 8 వేల 667 రూపాయలుగా ప్రకటించిందని తెలిపారు. ఆయా జిన్నింగ్ మిల్లుల యజమానులు మిల్లులలో రక్షణ చర్యలు చేపట్టాలని, విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలని, అగ్నిమాపక శాఖ అధికారులు మిల్లులను సందర్శించి రక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు.



తూనికలు కొలతల శాఖ అధికారులు తూకం యంత్రాలను తనిఖీ చేసి స్పష్టమైన నివేదికలు సమర్పించాలని తెలిపారు. రైతులు కిసాన్ కపాస్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకుని పత్తిని విక్రయిస్తారని, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పత్తి వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఎ.డి. అశ్వక్ అహ్మద్, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, విద్యుత్ శాఖ ఎస్.ఈ. ఉత్తమ్ జాడే, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బిచ్కుంద మున్సిపాలిటీలో నూతన బార్ కేటాయింపునకు 16న లక్కీ డ్రా

- 90 దరఖాస్తులు స్వీకరణ
- జిల్లా ఆబ్కారీ అధికారి బి. ముకుంద రెడ్డి

**కామారెడ్డి, అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి):-**



బిచ్కుంద మున్సిపాలిటీలో నూతన బార్ ఏర్పాటుకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 12వ తేదీన ముగిసిందని జిల్లా ఆబ్కారీ అధికారి బి. ముకుంద రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ ప్రక్రియలో మొత్తం 90 దరఖాస్తులు అందినట్లు వెల్లడించారు. బార్ కేటాయింపు ప్రక్రియను ఈ నెల 16వ తేదీన ఉదయం 11.00 గంటలకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా పద్ధతిలో పారదర్శకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు తమకు అధికారులు జారీ చేసిన రసీదులతో అదే రోజు ఉదయం 10.00 గంటలకు కామారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లోని ప్రధాన సమావేశ మందిరానికి హాజరు కావాలని జిల్లా ఆబ్కారీ అధికారి సూచించారు.

# 17 మందిని బైండోవర్ చేసిన పోలీసులు

**ఆసిఫాబాద్ ( వుదయం ప్రతినిధి )**

బెజ్జూర్ మండల పరిధిలో గుడుంబా, మట్కా మరియు కోడిపందాలకు సంబంధించిన కార్యకలాపాలకు పాల్పడిన మొత్తం 17 మంది వ్యక్తులను ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ మరియు తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేయడం జరిగిందని ఎస్సై రమేష్ తెలిపారు. ఇకపై సదరు వ్యక్తులు గుడుంబా, మట్కా, కోడిపందాలు మరియు ఇతర చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడకుండా, ప్రజాశాంతికి భంగం కలిగించకుండా ఉండాలని బైండోవర్ చర్యలు చేపట్టడం జరిగిందని ఎస్ఐ రమేష్ తెలిపారు. బెజ్జూర్ మండల పరిధిలో ఎవరైనా గుడుంబా తయారీ, విక్రయాలు, మట్కా, కోడిపందాలు లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడినట్లయితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రమేష్ హెచ్చరించారు. అలాగే, మండల పరిధిలో ఎక్కడైనా అనుమానాస్పద కార్యకలాపాలు, అక్రమ వ్యాపారాలు లేదా పైన పేర్కొన్న చట్టవిరుద్ధ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిసినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# రైతులను గాలికొదిలి.. ఢిల్లీలో రాజకీయాలా

**కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎమ్మెల్యే పాయల్ శంకర్ ధ్వజం**

**ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 13:**

రాష్ట్రంలో రైతులు విద్యుత్, సాగునీటి సమస్యలతో అల్లాడుతుంటే.. వారి ఇబ్బందులను పట్టించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఢిల్లీ వేదికగా రాజకీయాలు చేస్తోందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ విమర్శించారు. ముఖ్యమంత్రితో సహా మంత్రులు తరచూ ఢిల్లీ పర్యటనలకే ప్రాధాన్యమిస్తున్నారని ఆరోపించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

పంటల బీమా లేక రైతులు నష్టపోతున్నారని, గ్రామాల్లో రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నా ప్రభుత్వానికి పట్టింపు లేదని పాయల్ శంకర్ విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాల్సిన ప్రభుత్వం రాజకీయ కార్యక్రమాలకే ప్రాధాన్యమివ్వడం సరికాదన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను కాంగ్రెస్ నేతలు వ్యతిరేకించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఒకే వ్యక్తి




పేరుతో పలుచోట్ల ఓట్లు నమోదవడం, మరణించినవారి పేర్లు జాబితాలో ఉండటం వంటి సమస్యలను సరిచేయకూడదా? అని ప్రశ్నించారు. ఓటర్ల జాబితాలోని తప్పులను సరిదిద్దేందుకు చేపట్టే ప్రక్రియను కాంగ్రెస్ ఎందుకు వ్యతిరేకిస్తోందని నిలదీశారు. 2023 ఎన్నికల్లో ఇదే ఎన్నికల సంఘం నిర్వహించిన ఎన్నికల్లో గెలిచి పదవులు అనుభవిస్తున్న కాంగ్రెస్ నాయకులకు ఇప్పుడు ఆ సంఘంపై నమ్మకం లేకపోతే రాజీనామా చేయాలని సవాల్ విసిరారు.

# సదాశివనగర్ మండలంలో ఆహార భద్రతా అధికారి ఆకస్మిక తనిఖీలు

**గడువు ముగిసిన ఆహార ఉత్పత్తుల తొలగింపు**

**నిబంధనలు పాటించని వ్యాపారులకు నోటీసులు**

**కామారెడ్డి, అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి):-**

సదాశివనగర్ మండలంలో ఆహార భద్రతా అధికారి జి. విక్రమ్ మంగళవారం పలు చిల్లర దుకాణాలు, రెస్టారెంట్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కొన్ని దుకాణాల్లో గడువు ముగిసిన ఆహార ఉత్పత్తులను గుర్తించి, వాటిని వెంటనే తొలగించి పారవేయించారు. నాణ్యతపై అనుమానం ఉన్న పలు ఆహార పదార్థాల నమూనాలను సేకరించి, పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపించారు. అలాగే, ఆహార భద్రతా ప్రమాణాల ప్రకారం అవసరమైన ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ లేదా నమోదు లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్న పలు సంస్థలను గుర్తించి, సంబంధిత నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆహార భద్రతా అధికారి మాట్లాడుతూ, జిల్లాలోని ప్రతి ఆహార వ్యాపారి తప్పనిసరిగా ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ లేదా నమోదు కలిగి ఉండాలని సూచించారు. ఆహార



పదార్థాల నాణ్యత, పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యంగా ఉన్న ఆహార భద్రతా శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# చేవెళ్ల గిరిజన డిక్లరేషన్ అమలుకై చర్యలు చేపట్టాలి



**అచ్చంపేట,అక్టోబర్ 13:(వుదయం ప్రతినిధి )**

తెలంగా ణ గిరిజన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం అచ్చంపేట లో జరిగింది. సమావేశంలో గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్ నాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల డిక్లరేషన్ గిరిజనులకు ఇచ్చిన హామీలను తక్షణం అమలుకు కార్యాచరణ ప్రకటించాలని లేకపోతే రాష్ట్ర వ్యాపిత ఐక్య ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి. తండా గ్రామ పంచాయతీలకు రెవెన్యూ హోదా కల్పించి తండాల అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేయలి. మైదాన ప్రాంత గిరిజన అభివృద్ధికి ఐదు ఐటిడిఏ లను ఏర్పాటు చేయాలి. ప్రతి గిరిజన తండా, గూడెం గ్రామపంచాయతీలకు ప్రత్యేకంగా ఇస్తామన్న 25 లక్షల రూపాయలను తక్షణం ఇవ్వాలి. మూడు గిరిజన కార్పొరేషన్లను ఏర్పాటు చేసి ఒక్కో కార్పొరేషన్ కు 500 కోట్ల చొప్పున 1500 కోట్లను కేటాయిస్తామన్నారు.

ఠానూ నాయక్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై పెట్టాలి. గిరిజన బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలి. – లంబాడి భాషను గుర్తించి 8వ షెడ్యూల్లో చేర్చాలి. అని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు దేశ్య నాయక్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ లక్ష్మణ్,లక్ పతి నాయక్, కాట్రవత్ రవి నాయక్ జిల్లా నాయకులు వి శ్రీనివాసులు, ఎం తిరుపతి నాయక్ దశరథ నాయక్ శంకర్ నాయక్ గోపాల్ నాయక్ పాల్గొన్నారు.

# కన్నుల పండుగగా బతుకమ్మ సంబరాలు

**జిల్లా కలెక్టర్ కె హరిత, జిల్లా ఎస్పీ నికిత పంత్**

**ఆసిఫాబాద్ ( వుదయం ప్రతినిధి )**

కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా ఎస్పీ శ్రీమతి నితికా పంత్, ఐపీఎస్ హాజరై బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. పువ్వులను పూజించడం, ప్రకృతిని ఆరాధించడం తెలంగాణ ప్రజల గొప్ప సంస్కృతి, సంప్రదాయమని తెలిపారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా బతుకమ్మ పండుగ నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావి తరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.మహిళా పోలీసు అధికారులు, సిబ్బంది సంప్రదాయ దుస్తుల్లో ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలు ఉట్టిపడేలా సాగిన ఈ వేడుకలు కన్నుల పండువగా నిలిచాయి. ఈ కార్యక్రమం ద్వారా పోలీసు



కుటుంబాల్లో పండుగ వాతావరణం నెలకొనడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవం, ఐక్యతాభావం మరింత బలపడింది.

జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో జిల్లా ఎస్పీ శ్రీమతి నితికా పంత్,జిల్లా కలెక్టర్ శ్రీమతి హరిత,జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి శారదా దేవి, జె.ఎఫ్.సిఎం శ్రీమతి అనంతలక్ష్మి , డీఎఫ్ఓ శ్రీమతి బాలామణి జిల్లా మహిళా పోలీస్ సిబ్బందితో కలిసి పాల్గొని బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.



# ప్రాజెక్టుల భూసేకరణ, రెవెన్యూ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలి

**జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా**

**మహబూబ్‌నగర్ అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి)**

జిల్లా లో చేపడుతున్న జాతీయ రహదారులు, రైల్వే లైన్ల డబ్లింగ్, నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను వేగవంతం చేయడంతోపాటు, భూ భారతి, మీ సేవ ద్వారా వచ్చిన పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మండల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో భారత్‌మాల జాతీయ రహదారుల భూసేకరణ, రైల్వే లైన్ డబ్లింగ్, నీటిపారుదల ప్రాజెక్టులు, భూ భారతి, మీ సేవ దరఖాస్తులు, కుటుంబ సభ్యుల ధ్రువపత్రాల జారీ తదితర అంశాలను మండలాల వారీగా సమీక్షించారు.

భారత్‌మాల జాతీయ రహదారి ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ, భూముల స్వాధీన ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. భూముల స్వాధీనానికి సంబంధించిన వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని, గుర్తించాల్సిన లబ్ధిదారులు, అందుబాటులో లేని భూయజమానుల వివరాలను సేకరించి తదుపరి సమావేశం నాటికి పూర్తి స్థాయి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. భూసేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైల్వే లైన్ డబ్లింగ్‌కు అవసరమైన భూముల సేకరణను వేగవంతం చేయాలని, రెవెన్యూ, రైల్వే అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. కోయిల్‌సాగర్, రాజీవ్ భీమా, లక్ష్మీదేవిపల్లి తదితర నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణను కూడా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, ఆర్డీఓ నవీన్, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్‌రెడ్డి, నూతనంగా నియమితులైన భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎ. యాదగిరి, భూమి రికార్డులు, సర్వే విభాగం ఏడీ అశోక్, జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీ ఉపేందర్, తహసీల్దార్లు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి హరీశ్ రావును కలిసిన ఝరాసంగం మండల సర్పంచ్ లు, బిఆర్ఎస్ నాయకులు

**ఝరాసంగం అక్టోబర్-13(వుదయం ప్రతినిధి )**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం ఝరాసంగం మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సర్పంచులు,సీనియర్ నాయకులు, పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళ్లి మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావును, మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ప్రతి సర్పంచ్,లకు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎమ్మెల్యే కోనింటి మాణిక్ రావు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ శివకుమార్, మాజీ సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్,మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు వెంకటేశం,మాజీ కేతకీ ఆలయ కమిటీ చైర్మన్ నరసింహ గౌడ్, గంగాపూర్ సర్పంచ్ &ప్యారారం సర్పంచ్,లతో పాటు



పలువురు ప్రజాప్రతినిధులు,సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్ రావు సర్పంచులు, నాయకులను ఆత్మీయంగా పలకరించి స్వాగతించారు. పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు తరలివెళ్లడం బీఆర్ఎస్ శ్రేణుల్లో రాజకీయ ఉత్సాహాన్ని ప్రతిబింబించింది.

# జన్మదినం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన అలుగుబెల్లి రవీందర్‌రెడ్డి

**నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి అక్టోబర్ 13**

నల్లగొండ జిల్లా జన్మదినం సందర్భంగా అలుగుబెల్లి రవీందర్‌రెడ్డి మంగళవారం ఢిల్లీలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డికి ముఖ్యమంత్రి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు దుబ్బాక నరసింహారెడ్డి, నల్లగొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న కైలాస్ నేత తదితరులు రవీందర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



# వసతి గృహాలకు గుడ్ల సరఫరా టెండర్ల సాంకేతిక బిడ్ల పరిశీలన పూర్తి

**కామారెడ్డి, అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి):-**

కామారెడ్డి జిల్లాలోని సంక్షేమ, గురుకుల వసతి గృహాలకు గుడ్ల సరఫరా చేసేందుకు నిర్వహించిన టెండర్లలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధ్యక్షతన మంగళవారం సాంకేతిక బిడ్ల పరిశీలన చేపట్టారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి, సంబంధిత కమిటీ సభ్యులు పాల్గొన్నారు. టెండర్లలో పాల్గొన్న సంస్థలు, సరఫరాదారులు సమర్పించిన సాంకేతిక బిడ్లు, సంబంధిత ధ్రువపత్రాలను నిర్దేశిత అర్హత ప్రమాణాలు, ప్రభుత్వ నిబంధనల మేరకు కమిటీ క్షుణ్ణంగా పరిశీలించింది. తదుపరి టెండర్ల ప్రక్రియను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించనున్నట్లు అధికారులు



తెలిపారు. జిల్లాలోని అన్ని సంక్షేమ, గురుకుల వసతి గృహాలకు గుడ్ల సరఫరా ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.